# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 9

సోమవారం, మే 19, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## కొన్ని కేటగిరీలకు ఉమ్మడి పరీక్షలు

- గురుకుల కొలువుల భర్తీకి
- టీఆర్ఈఐఆర్‌బీ కొత్త విధానం
- పీజీటీ, జేఎల్, డీఎల్ పోస్టులకు పేపర్-1 ఉమ్మడిగానే..
- ఆగస్టు 1వ తేదీ నుంచి 22 వరకు నిర్వహణ

2 లో

## మరో రెండ్రోజులు వడగాడ్పులు

- నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి
- వర్షాలు సైతం కురిసే అవకాశం

ఏపీలో 20 నుంచి వర్షాలు



## మౌలిక సూత్రాలకు లోబడే న్యాయవ్యవస్థ పనిచేస్తుంది

'ఐలు' సదస్సులో హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్



**యాదాద్రి/యాదగిరిగుట్ట, జూన్ 18 (వాయిస్ టుడే):** రాజ్యాంగంలో మార్పులెన్ని తెచ్చినా న్యాయవ్యవస్థ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడే పనిచేస్తుందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. యాదాద్రి జిల్లా భువనగిరిలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు (ఐలు) ఆదివారం రెండవ రోజు ముగిశాయి. ఇందులో భాగంగా 'రాజ్యాంగం-న్యాయవ్యవస్థ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్నవారు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు కట్టుబడి పనిచేయాలని, రాజ్యాంగం మౌలిక సూత్రాలకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించవద్దని కేశవానంద భారతి కేసు తీర్పుతో మరోసారి స్పష్టమైందన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితిలో, ప్రభుత్వం పౌరుల హక్కులను కాల రాసినప్పుడు

- మిగతా 2వ పేజీలో

## మళ్లీఅదరగొట్టారు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చూపిన తెలుగు విద్యార్థులు

టాప్ ర్యాంకర్ నాగర్ కర్నూల్‌కు చెందిన చిద్విలాసరెడ్డి

టాప్ టెన్‌లో ఇద్దరు తెలంగాణ, నలుగురు ఏపీ వారే..

బాలికల్లో మొదటి ర్యాంకు సాధించిన తెలుగు విద్యార్థిని భవ్యశ్రీ

గతంతో పోలిస్తే పెరిగిన కటాఫ్ మార్కులు..

నేటి నుంచే ఐఐటీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

జూన్ 30న తొలి విడత సీట్ల కేటాయింపు



**హైదరాబాద్, జూన్ 18 (వాయిస్ టుడే):** జేఈఈ మెయిన్స్‌లో సత్తా చూపిన తెలుగు విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షలోనూ అదరగొట్టారు. జాతీయ స్థాయిలో మొదటి, రెండో ర్యాంకులతోపాటు టాప్%--%10లో ఆరుగురు తెలుగు విద్యార్థులే నిలిచారు. ఇందులో వావిలాల చిద్విలాసరెడ్డి (1వ ర్యాంకు), నాగిరెడ్డి బాలాజీరెడ్డి (9వ ర్యాంకు) తెలంగాణ వారుకాగా.. రమేశ్ సూర్యతేజ (2వ), అడ్డగడ వెంకట శివరాుమ్ (5వ), బిక్కిని అభినవ్ చౌదురి (7వ), వైపీవీ మనీందర్‌రెడ్డి (10వ ర్యాంకు) ఏపీకి చెందినవాురు. ఇక మహిళల్లో జాతీయ టాప్ ర్యాంకర్ (298 మార్కులు)గా ఏపీ విద్యార్థిని నాయకంటి నాగ భవ్యశ్రీ

- మిగతా 2వ పేజీలో







# 100 మంది బలి!

- యూపీ, బిహార్‌లలో 98 మరణాలు నమోదు
- 400 మంది ఆస్పత్రికి.. వృద్ధులే ఎక్కువ
- ఉత్తరాదిన కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలో మరో రెండ్రోజులు వడగాడ్పులు

**న్యూఢిల్లీ, జూన్ 18 (వాయిస్ టుడే):** ముంచెత్తిన వరదలకు వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం చూశాం..! విపరీతమైన చలిని తట్టుకోలేక పదుల సంఖ్యలో ప్రజలు చనిపోవడం గురించి విన్నాం..! కానీ, ఎండకు జనం పిట్టల్లా రాలడం అంటే ఎట్లుంటుందో - 2లో

# రిటైర్డ్ ఎంపీడీవో దారుణ హత్య

- జనగామ జిల్లాలో కిడ్నాప్ ఘటన విషాదాంతం
- నీటి గుంటలో రామకృష్ణయ్య మృతదేహం
- ఆయన్ను హతమార్చింది సుపారీ గ్యాంగ్
- బీఆర్ఎస్ జడ్పీ వైస్ చైర్మన్ భర్త అంజయ్యే సూత్రధారి
- తన భూ దందాకు అడ్డొస్తున్నాడనే కక్షతోనే..
- రూ.8 లక్షలిచ్చి హత్యకు డీల్.. 2 లక్షలు అడ్వాన్స్
- గత ఏడాదే కారుతో ఢీకొట్టి చంపాలని ప్లాన్.. విఫలం
- ఇప్పుడు కిడ్నాప్ చేసి, గొంతు నులిమి చంపేశారు
- అంజయ్య సహా ముగ్గురి అరెస్టు.. ఇద్దరు పరారీలో
- ఈ కేసు విచారణలో వెలుగులోకి మరో హత్య
- బావమరిది భార్యనూ హత్య చేయించిన అంజయ్య



రామకృష్ణయ్య

**జనగామ/బచ్చన్నపేట/చేర్యాల/హనుమకొండ క్రైం, జూన్ 18 (వాయిస్ టుడే):** జనగామ జిల్లాలో కిడ్నాప్ వ్యవహారం విషాదాంతమైంది. బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన విశ్రాంత ఎంపీడీవో నల్ల రామకృష్ణయ్య ఈ నెల 15న అపహరణకు గురయ్యారు. అదే రోజు ఆయన కుమారుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం జనగామ మండలం చంపక్‌హిల్స్‌లోని ఓ మూతపడ్డ క్రషర్ వద్ద నీటి గుంటలో రామకృష్ణయ్య శవమై తేలారు. ఈ నెల 15న ఆయన బచ్చన్నపేట నుంచి పోచన్నపేటకు వస్తుండగా గ్రామ సమీపంలో పలువురు దుండగులు బైక్‌ను అడ్డుకొని కిడ్నాప్ చేశారు. కుమారుడు అశోక్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. రామకృష్ణయ్యతో సన్నిహితంగా ఉన్న వ్యక్తులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు అనుమానం ఉన్న వారిని విచారించారు. విచారణలో భాగంగా పోలీసులకు పట్టుబడిన నిందితులు రామకృష్ణయ్యను హత్య చేసి చంపక్‌హిల్స్‌లోని క్రషర్ వద్ద నీటి గుంటలో

# పవర్‌లోకి వస్తామని పగటి కలలు

- అప్పుడే గాలిలో మేడలు కడుతున్నారు
- టీపీసీసీ అంటే...టెయింటెడ్ పొలిటీషియన్స్ ఆఫ్ క్రైమ్ అండ్ కరప్షన్
- ట్విట్టర్‌ఈ వేదికగా కాంగ్రెస్ తీరుపై బండి సంజయ్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, కరీంనగర్, జూన్ 18 (వాయిస్ టుడే):** తెలంగాణలో అధికారం లోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని, అప్పుడే గాలిలో మేడలు కడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరిగిన వివిధ ఉప ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా పరాజయం పాలైన విషయాన్ని వారు సులభం గా మరిచిపోయినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. టీపీసీసీ అంటే టెయింటెడ్ పొలిటీషియన్స్ ఆఫ్ క్రైమ్ అండ్ కరప్షన్.. అని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అన్ని సామాజిక భద్రతా పథకాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గతంలోని లోటుపాట్లను తొలగించి మరింత మెరుగ్గా అవి అమలయ్యేలా ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ మేరకు ఆదివారం ట్విట్టర్‌ఈ వేదికగా సంజయ్ ట్వీట్ చేశారు. ఇప్పటికే ధరణి, సంక్షేమ పథకాలు, పెన్షన్లు వంటి వాటిపై రాష్ట్ర ప్రజల్లో అనిశ్చితి, అయోమయం రేకెత్తించే ప్రయత్నాల్లో కాంగ్రెస్ నిమగ్నమైతే... మరోవైపు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు రద్దవుతాయంటూ సీఎం కేసీఆర్ ప్రజల్లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ సర్వేలోనే బీఆర్ఎస్‌కు 30 స్థానాలు**

కేసీఆర్ నిర్వహించిన సర్వేలోనే బీఆర్ఎస్‌కు 30 స్థానాలకు మించి రావని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గెలవాలనే సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారని సంజయ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేస్తున్నట్టు కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే చెప్పారని గుర్తుచేశారు. గుంట నక్కలే గుంపులుగా వస్తాయని, బీజేపీ సింగిల్‌గానే పోటీ చేస్తుందని బండి స్పష్టం చేశారు. బీజేపీ మహాజన్ సంపర్క్

- మిగతా 2వ పేజీలో




## అద్భుత జోడి... అపూర్వ విజయం

- ఇండోనేసియా ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ నెగ్గిన సాత్విక్-చిరాగ్
- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ జోడీగా గుర్తింపు

ఆద్యంతం అద్భుత ఆటతో ఆకట్టుకున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుతం చేసింది. పురుషుల డబుల్స్ విభాగంలో తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. జకార్తాలో ఆదివారం జరిగిన ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 21-17, 21-18తో ప్రపంచ మూడో ర్యాంక్ జంట, ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌గా ఉన్న ఆరోన్ చియా-సో వుయ్‌యిక్ (మలేసియా)పై గెలుపొందింది. విజేతగా నిలిచిన సాత్విక్-చిరాగ్ జోడీకి 92,500 డాలర్ల (రూ.75 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 12,000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ జంటకు 43,750 డాలర్ల (రూ. 35 లక్షల 84 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 10,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## గెలుస్తాననే నమ్మకం నాకు లేదు

నన్ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి

నోటా ఓట్లు జనసేనకు వేయండి

కాకినాడ సభలో పవన్‌కళ్యాణ్



**కాకినాడ, జూన్ 18 (వాయిస్ టుడే):** 'నేను గెలుస్తాననే నమ్మకం నాకు లేదు. కానీ, పోరాటం మాత్రం ఆపేది లేదు'.. అని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. 'కీడెంచి మేలెంచాలనే ఈ విషయం మీకు చెబుతున్నాను. నన్ను చంపేస్తామని బెదిరింపులు వస్తున్నాయి. అయినా భయముదేదిలేదు. కులాన్ని చూడకండి. తెలంగాణ ప్రజల మాదిరిగా కులం కంటే నా ఆంధ్రా అనే భావన అందరిలోనూ రావాలి'.. అని ఆయనన్నారు. వారాహి యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి జిల్లా కేంద్రమైన కాకినాడలోని సర్పవరం జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. 'మీరు అండగా నిలబడితే నేను, జనసేన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్తాం. నాకు ఫలానా కులం ఎక్కువ, మరో కులం తక్కువ అనేది లేదు. అధికారం లేకున్నా 2008 నుంచి మీకోసం పోరాడుతూనే ఉన్నాను'.. అని చెప్పారు. రాజకీయం వేరు,

- మిగతా 2వ పేజీలో

## నేను మొగోన్ని.. మీసాలు మెలేస్తా!

నేను రౌడీనైతే ఎమ్మెల్సీ ఎలా ఇచ్చావు?

మంత్రి కేటీఆర్‌కు కొండా మురళి ప్రశ్న



**మట్టెవాడ (వరంగల్), జూన్ 18 (వాయిస్ టుడే):** 'నేను మొగోన్ని.. మీసాలు మెలేస్తా.. నన్ను రౌడీ అంటున్నావు.. మీ పార్టీ నాకెలా ఎమ్మెల్సీ ఇచ్చింది. శ్రీకృష్ణదేవరాయులు వంశంలో పుట్టినోళ్లం. మీసాలు మెలేస్తం. నువ్వు ఆడది కాదాయే.. మొగోడివి కాదాయె.. మీసాలు లేక ఎవరో తెలియకపాయె.. మీసాలుంటే మెలేస్తే బుద్ధివంతుడివి, ధైర్యవంతుడివి అనుకునేవాళ్లం' అని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు కొండా మురళీధర్‌రావు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపేరు పలికే ధైర్యం లేదంటూ కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శలు చేశారు. 2014లో బస్వరాజ్ సారయ్యను ఓడించేందుకే వరంగల్ తూర్పులో టీఆర్ఎస్ తరపున కొండా సురేఖను కేసీఆర్ పోటీ చేయించాన్నారు. కేటీఆర్ పైసలు తీసుకొని

- మిగతా 2వ పేజీలో



## గమ్యం లేని నాయకుడు భట్టి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

2 లో



## క్రూరమైన 'ఉపా' రద్దుకు కేంద్రంపై ఒత్తిడి

- క్రూరమైన 'ఉపా' రద్దుకు కేంద్రంపై ఒత్తిడి
- సీఎంకు ప్రొఫెసర్ హరగోపాల్ సూచన

2 లో



## ఆ డబ్బులు కిషన్‌రెడ్డి అయ్యసొత్తు కాదు

- ప్రజలు పన్నులుగా చెల్లించిన డబ్బులే మీరిచ్చేది
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్

2 లో



## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- పక్కకు ఒరిగిన ఆరు బోగీలు
- విజయనగరం జిల్లాలో ఘటన

2 లో



## బీఆర్ఎస్ హయాంలో బతికే స్వేచ్ఛ లేదు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- పాదయాత్రకు సంఘీభావం తెలిపిన మాణిక్‌రావు ఠాక్రే

2 లో



## ఇక బోనమెత్తుడే

- జిల్లాలో అమ్మవారి దేవాలయాల ముస్తాబు
- వనభోజనాలు షురూ
- నేటి నుంచి ఆషాఢ మాసం ప్రారంభం

2 లో



## వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి
- నేటికి రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఇవ్వలే

2 లో

## గమ్యం లేని నాయకుడు భట్టి

### గుత్తా సుఖేందర్‌రెడ్డి

**మిర్యాలగూడ:** భట్టి విక్రమార్క.. గమనం, గమ్యం లేని నాయకుడని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భట్టి విక్రమార్క పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేదని, నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో జరిగిన సభలో 150 మంది మాత్రమే పాల్గొన్నారని తెలిపారు. పబ్లిసిటీ కోసం తనపైన, మంత్రి జగదీష్‌రెడ్డిపైన ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫ్లోరైడ్ ప్రాంతాలకు నీటిని అందించేందుకు డిండి ప్రాజెక్టును పూర్తి చేశామని, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు 9కి.మీ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. 'పాలమూరు- రంగారెడ్డి' పూర్తికాకుండా గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి స్టేలు తీసుకొచ్చిన దుర్మార్గులు కాంగ్రెస్ నేతలని గుత్తా ఆరోపించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు ఏ ఒక్కరోజూ తెలంగాణ కోసం పోరాటం చేయలేదని గుర్తుచేశారు. తాను రాష్ట్ర సాధన కోసం కొట్లాడానని, ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. కాలువలు తవ్వి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 100 మంది బలి!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు తెలుస్తోంది. జూన్ నెల సగం గడిచినా నడినెత్తిన సూరీడు నాట్యమాడుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉత్తరం, దక్షిణం, పశ్చిమం, తూర్పు అని తేడా లేకుండా దేశమంతా తీవ్ర వడగాలులతో ఉడికిపోతోంది. మూడు రోజుల వ్యవధిలో యూపీలో 54 మంది, బిహార్‌లో 44 మంది మృతి చెందారు. యూపీలోని మరణాలన్నీ బలియా జిల్లా ఆస్పత్రిలోనివే. జ్వరం, శ్వాస ఆడకపోవడం, ఇతర అనారోగ్య కారణాలతో 15-17 తేదీల మధ్య 400 మంది ఆస్పత్రిలో చేరారు. ఎక్కువ శాతం 60 ఏళ్లు దాటినవారేనని.. మొదటి రోజు 23 మంది, తర్వాతి రోజు 20 మంది, శుక్రవారం సాయంత్రం వరకు 11 మంది మృతి చెందినట్లు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ దివాకర్‌సింగ్ తెలిపారు. మరోవైపు బిహార్ రాజధాని పట్నాలో 24 గంటల్లో 35 మంది, ఇతర జిల్లాల్లో 9 మంది చనిపోయారు. పట్నాలోని నలంద వైద్య కళాశాలలోనే 19 మంది మృతిచెందారు. రాష్ట్రంలో 11 జిలాల్లో 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం 18 ప్రాంతాల్లో అతి తీవ్ర వడగాలులు వీస్తున్నాయి.

**బలియా ఆస్పత్రి సీఎంఎసపై వేటు:** వైద్య వర్గాల భిన్న ప్రకటనలతో బలియా ఆస్పత్రిలో మరణాలపై వివాదం నెలకొంది. వడ గాలులకు ఇద్దరే చనిపోయారని చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) డాక్టర్ జయంత్‌కుమార్ అంటున్నారు. ఈ నెల 15- 17 మధ్య 400 మంది చేరారని.. మృతులంతా 60 ఏళ్లు దాటినవారే అని పేర్కొన్నారు. ఎండ తీవ్రతకు 54 మంది చనిపోయారంటూ సరైన ఆధారాలు లేకుండా, నిర్లక్ష్యంగా ప్రకటించినందుకు సీఎంఎస్ డాక్టర్ దివాకర్‌సింగ్‌ను ప్రభుత్వం అజాంగఢ్‌కు బదిలీ చేసింది. డాక్టర్ ఎస్‌కే యాదవ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఆస్పత్రిపై తీవ్ర ఒత్తిడి ఉందని, రోజుకు 125 నుంచి 135 మంది అడ్మిట్ అవుతున్నారని యాదవ్ చెప్పారు. గురువారం 154 మంది చేరగా 23 మంది వివిధ కారణాలతో మృతి చెందినట్లు తెలిపారు. 16న 20మంది, 17న 11 మంది చనిపోయారని వివరించారు. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున గుండె పోటు మరణాలూ ఉండొచ్చన్నారు. కాగా, ఈ ఆస్పత్రిలో రోజుకు సగటున 8 మరణాలు నమోదు అవుతుంటాయి. పెద్దసంఖ్యలో చనిపోవడానికి ఏదైనా వ్యాధి కారణమై ఉంటుందని అజాంగఢ్ డివిజన్ ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ ఓపీ తివారి తెలిపారు. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న సంగతి అంగీకరిస్తూనే.. ఇలాంటప్పుడు దీర్ఘకాల రోగుల మరణాల శాతం పెరుగుతుందన్నారు.

**కలుషిత నీరు కారణమా?:** లఖ్‌నవూ నుంచి ఇద్దరు డైరెక్టర్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో వైద్య బృందం ఆదివారం బలియా చేరుకుని రోగుల మరణ కారణాలపై విచారణ జరిపింది. 54 మరణాలకు వేడి కారణం కాదని స్పష్టం చేసింది. సమీప జిల్లాల్లోనూ ఇంతే తీవ్రతతో ఎండలు ఉన్నట్లు చెప్పింది. అక్కడ మరణాలు పెద్దగా లేని సంగతిని గుర్తుచేసింది. బలియా ఆస్పత్రిలో ఎక్కువమంది ఛాతీ నొప్పితోనే చనిపోయారని.. ఈ లక్షణం వడగాలి బాధితుల్లో ఉండదని పేర్కొంది. కలుషిత నీటి కారణంగానే మరణాలు సంభవించి ఉంటాయని అభిప్రాయపడింది.

**పలు రాష్ట్రాల్లో విద్యా సంస్థలు బంద్:** గరిష్ఠ ఉష్ణోగ్రతల రీత్యా విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించిన పలు రాష్ట్రాలు వేసవి సెలవులను పొడిగిస్తున్నాయి. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఐదో తరగతి లోపు పాఠశాలలను ఈ నెల 30 వరకు మూసివేయనుంది. 6 నుంచి 12వ తరగతి వారికి ఉదయం వేళ మాత్రమే పాఠాలు బోధించాలని ఆదేశించింది. బిహార్‌లోని పట్నా, మరికొన్ని జిల్లాల్లో ఈ నెల 24 వరకు సెలవులిచ్చారు.

## రిటైర్డ్ ఎంపీడీవో దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

పడేసినట్లుగా అంగీకరించారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో పోలీసులు రామకృష్ణయ్య మృతదేహాన్ని గుర్తించారు. తొలుత ఆయన మృతదేహాన్ని గుర్తించడంలోనూ హైడ్రామా నడిచింది. చంపక్‌హిల్స్‌లోని క్రషర్ వద్ద మృతదేహం ఉందంటూ శనివారం రాత్రి 7 గంటల సమయంలో వదంతులు వ్యాపించాయి. నిందితులు సైతం పోలీసులకు ఆ స్థలాన్ని చూపించినట్లుగా ప్రచారం జరిగింది. మృతదేహం లభ్యమైనట్లుగా పోలీసు వర్గాల్లోనూ ప్రచారం జరిగినప్పటికీ అలాంటిదేమీ లేదని చెప్పారు. కాగా.. శనివారం రాత్రే మృతదేహాన్ని కనిపెట్టి ఉంటే ఆదివారం ఉదయం వరకు గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని మృతుడి కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

**కఠినంగా శిక్షించాలి: ముత్తిరెడ్డి**

రిటైర్డ్ ఎంపీడీవో నల్లా రామకృష్ణయ్య దారుణహత్య బాధాకరమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. పోలీసులు పారదర్శక విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఆదివారం చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిందితుల్లో ఏ పార్టీ వారున్నా, ఎంతటి వారున్నా వదిలిపెట్టకూడదని చెప్పారు. ఈ విషయమై తాను వరంగల్ పోలీస్ కమిషనర్‌తో పాటు జనగామ జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడానని తెలిపారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.

## మరో రెండ్రోజులు వడగాడ్పులు

**హైదరాబాద్:** రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

**ఏపీలో 20 నుంచి వర్షాలు**

**అమరావతి:** ఏపీలో ఈనెల 20వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాయలసీమను తాకి నా మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుండా ఆగిపోయిన రుతుపవనాలు ముందుకు కదిలేందుకు అనువైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శ్రీహరికోట, పుట్టపర్తి, కర్ణాటకలోని రత్నగిరి, కొప్పల్ ప్రాంతాల్లోనే పది రోజులుగా రుతుపవనాలు కేంద్రీకృతమై ఉన్నాయి. వచ్చే రెండు, మూడు రోజుల్లో ఇవి దక్షిణ ద్వీపకల్ప భారతదేశం, పశ్చిమ బెంగాల్, జార?ండ్, బిహార్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని చెబుతున్నారు.

## ఆ డబ్బులు కిషన్‌రెడ్డి అయ్యసొత్తు కాదు

**మహబూబాబాద్:** 'కేంద్రం పేదలకు పంపిణీ చేస్తున్న డబ్బులు.. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించివే, ఆ డబ్బులు కిషన్‌రెడ్డి అయ్యసొత్తు కాదు'అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. సీపీఎం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సు యాత్ర ఆదివారం మహబూబాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ప్రధాని మోదీ చెబుతున్నారని, కానీ వాళ్లది బుల్డోజర్ల సర్కార్ అని ధ్వజమెత్తారు.

## వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి: జానారెడ్డి

**తిరుమలగిరి(సాగర్), జూన 18:** ఇచ్చిన హామీలను నెరవేర్చని సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. గిరిజన చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం ఆయన బట్టువెంకన్న బావితండాలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి సీఎం కేసీఆర్ గద్దె నెక్కాడని, ఎన్నికల హామీ లను అమలుచేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. నేటికి రైతులకు రూ.లక్ష రుణమాఫీ ఇవ్వలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూంలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ వంటి ఎన్నో హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఒకే దఫాలో రూ.లక్ష రుణ మాఫీ చేసిందని అన్నారు. ఇళ్లులేని ప్రతి పేదవారికి తమ హయాంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బట్టువెంకన్నబావితండాకు చెందిన సుమారు 25 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సమక్షంలో చేరారు.

## ఇక బోనమెత్తుడే

**సిరిసిల్ల:** తెలుగు పండుగలు ఎక్కువగా ప్రకృతితో ముడిపడి ఉంటాయి. ఇందులో బోనాల పండుగ ప్రత్యేకం. అషాఢం వచ్చిందంటే పల్లె నుంచి పట్నం వరకు బోనాల పండుగను నిర్వస్తారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆషాఢమాసంలో బోనమెత్తుకోవడానికి జిల్లా ప్రజలు కూడా సిద్ధమయ్యారు. గ్రామ దేవతలు చల్లగా చూడాలని తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ఆషాడ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని సిరిసిల్ల. వేములవాడ, వేములవాడ రూరల్, ఇల్లంతకుంట, తంగళ్లపలి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, గంభీరావుపేట, వీర్నపల్లి, బోయినపల్లి మండలాల్లో పోచమ్మ దేవాలయాల వద్ద వేడుకలు నిర్వహించనున్నారు. జూన్ 22, జూలైలో 9, 10, 16, 17 తేదీల్లో సామూహిక బోనాల సంబరం చేపట్టనున్నారు.

## కొన్ని కేటగిరీలకు ఉమ్మడి పరీక్షలు

**హైదరాబాద్:** గురుకుల ఉద్యోగాల భర్తీకి నిర్వహించే అర్హత పరీక్షలకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) వ్యూహాత్మక కార్యాచరణ చేపట్టింది. పరీక్షలను సులభతరంగా నిర్వహించే క్రమంలో అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. ఆగస్టు 1 నుంచి 22వ వరకు పరీక్షలు నిర్వహించనుంది. పరీక్షల వారీగా తేదీలను ఖరారు చేస్తూ రూపొందించిన వ్యూహాత్మక టైమ్‌టేబుల్‌ను టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఉంచింది. విద్యార్హతలు సమానమైన కేటగిరీ కొలువులకు పరీక్షలను ఉమ్మడిగా నిర్వహిస్తోంది. తద్వారా అభ్యర్థులు ఒక పేపర్‌లో అర్హత సాధిస్తే సంబంధిత పోస్టులకు అర్హత సాధించినట్లే.

## క్రూరమైన 'ఉపా' రద్దుకు కేంద్రంపై ఒత్తిడి

### సీఎం కేసీఆర్‌కు ప్రొఫెసర్ హరగోపాల్ సూచన

**పాలమూరు:** ప్రజల హక్కులను హరించేలా ఉన్న క్రూరమైన ఉపా చట్టాన్ని రద్దు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై సీఎం కేసీఆర్ ఒత్తిడి తేవాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఉపా చుట్టాన్ని రద్దు చేస్తామని ఆయా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొనాలని డిమాండ్ చేశారు. ఉపా చట్టానికి ప్రజాస్వామ్యంలో చోటులేదని వ్యాఖ్యానించారు. అక్రమంగా నమోదు చేసిన ఉపా కేసును తనతో సహా మరో ఆరుగురిపై మాత్రమే రద్దు చేసిందని, మిగిలిన వారిపై కేసు అలాగే ఉందన్నారు. వారు ఎలాంటి దేశ ద్రోహానికి పాల్పడిన వారు కాదని, అంతా అమాయకులని చెప్పారు. ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు ఉపా చట్టాన్ని ఎత్తివేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని అప్పట్లో ఎవరినైనా ఏ కారణం లేకుండా అరెస్టు చేసి మూడు నెలల పాటు ఎలాంటి విచారణ లేకుండా జైలులో నిర్బంధించవచ్చని, బీజేపీ ప్రభుత్వం దానిని ఆరు నెలలకు పెంచిందని హరగోపాల్ వివరించారు. ఎక్కడైనా ఒక వ్యక్తిమీద నేరం రుజువు చేయాలంటే పోలీసులు తగిన సాక్ష్యాలు కోర్టులో ప్రవేశపెట్టి శిక్షపడేలా చేయాల్సి ఉంటుందన్నారు. ఉపా చట్టంలో నేరం మోపబడిన వ్యక్తి తాను నేరం చేయలేదని రుజువు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో బతికే స్వేచ్ఛ లేదు

**నల్లగొండ, జూన్ 18:** రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనను వదిలించుకోకుంటే నీళ్లు,నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ లక్ష్యాలు నెరవేరకపోవడంతో పాటు బతికే స్వేచ్ఛ కూడా ప్రజలు కోల్పోతారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం 94వ రోజు పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గమ్యం, గమనం లేని పొద్దుతిరుగుడు పువ్వు గుత్తా సుఖేందర్‌రెడ్డి అని, అధికారం ఎక్కడ ఉంటే దాని చుట్టూ ఆయన తిరుగుతారని అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు సాగుతున్న పాదయాత్రను భగభగ మండుతున్న ఎండలు, గాలి, వానలతో టెంట్లు కూలినా, అకాల వర్షంతో తడిచినా ఎక్కడా ఆపలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దేశానికి తెలియజేశామన్నారు. రూ.42వేల కోట్ల నిధులతో అమలుచేస్తున్న మిషన్ భగీరథ నీళ్లు తాను పాదయాత్ర చేసిన గ్రామాల్లో 90శాతం కనిపించలేదన్నారు. ఖాళీగా ఉన్న పైపులు, కట్టిన ట్యాంకులను ప్రజలు తనకు చూపించారన్నారు. నీళ్ల పండుగ పేరుతో జలాల్లో పసుపు, కుంకుమ వదులుతున్న మంత్రి జగదీషరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్, నక్కలగండి పెండింగ్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీపుల్స్‌మార్చ్ ఇన్‌చార్జి బుల్లెట్ బాలు, నాయకులు కొండేటి మల్లయ్య, గుమ్ముల మోహన్‌రెడ్డి, చలమల్ల కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**శృంగవరపుకోట/తాటిచెట్లపాలెం:** కిరండూల్ నుంచి విశాఖకు ఐరన్ ఓర్ లోడుతో వస్తున్న గూడ్స్ రైలు విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవర వద్ద ఆదివారం సాయంత్రం పట్టాలు తప్పింది. పాయింట్ నంబరు 23ఏ వద్ద కిలోమీటరు 23 నుంచి 29 మధ్య ఆరు బోగీలు పక్కకు ఒరిగాయి. ఇటీవల కొత్తగా వేసిన ట్రాక్‌పై ఈ ప్రమాదం జరిగింది. డౌన్ ట్రైన్ 20 కి.మీ. వేగంతో రావాల్సి ఉండగా ప్రమాద సమయంలో 40 కి.మీ. వేగంతో ఉందని రైల్వే సిబ్బంది తెలిపారు. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి, సీనియర్ అధికారుల బృందం ఘటనా స్థలానికి చేరు కుని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను సోమ, మంగళవారాల్లో రద్దు చేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు.

## పవర్‌లోకి వస్తామని పగటి కలలు

(మొదటి పేజీ తరువాయి)

అభియాన్‌లో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో ఆదివారం టిఫిన్ బైటక్‌లో బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై సీఎం కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా దుస్తులపై రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ స్పందించిన తీరు అవమానకరమన్నారు.

**బీఆర్ఎస్ నేతల దోపిడీపైనే ఐటీ దాడులు**

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న దోపిడీకి అంతు లేకుండా పోయిందని అందుకే వారిపై ఐటీ దాడులు జరుగుతున్నాయని ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసే విషయంతో బీజేపీకి సంబం ధం లేదని, అది దర్యాప్తు సంస్థలు చూసుకుంటాయని చెప్పారు. కాంగ్రెస్ మాదిరిగా ఈడీ, సీబీఐలను గుప్పిట్లో పెట్టుకునే సంస్కృతి బీజేపీది కాదన్నారు.

## నేను మొగోన్ని.. మీసాలు మెలేస్తా!

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తారని, తాను ఫ్రీగా పనిచేస్తానని చెప్పారు. అజంజాహీ మిల్లు స్థలం విషయంలో తనకు కేటీఆర్‌కు లొల్లి మొదలైందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్‌లు పరిపాలనపై కాకుండా 30 శాతం కమీషన్‌పై శ్రద్ధ పెట్టారని ఆరోపించారు. సెంట్రల్ జైలును కుదువ పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ కుటుంబ నియంత పాలనకు చరమగీతం పాడతారన్నారు. ఎన్నికల తర్వాత కేసీఆర్ కుటుంబం విదేశాలకు పారిపోతుందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 10మంది కార్పొరేటర్లు తనతో టచ్‌లో ఉన్నారని చెప్పారు.

## గెలుస్తాననే నమ్మకం నాకు లేదు

(మొదటి పేజీ తరువాయి)

సినిమాలు వేరని అన్నారు. సభలకు రావడం కాదు.. ఎన్నికల్లో ఓటేసి సత్తా చాటాలని, గత ఎన్నికల్లో పార్టీలపై కోపంతో నోటాకు వేసిన 3-4 శాతం ఓట్లను ఈసారి జనసేనకు వేయాలని పవన్ వేడుకున్నారు. మధ్యతరగతి మేధావులు మౌనంగా ఉండటమే ప్రశాంత ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ అడ్డాగా మారడానికి కారణమని ఆయన ఆరోపించారు. అన్యాయం జరుగుతున్నప్పుడు యువత మేలుకోకపోతే అరాచకాలు పెరిగిపోతాయన్నారు.

**దళితులకు సీఎం అన్యాయం చేశారు:** దళిత యువతకు సంబంధించిన 18 పథకాలు రద్దుచేసిన ఈ ముఖ్యమంత్రిని ఏమనాలని పవన్ ప్రశ్నించారు. అంబేడ్కర్ విదేశీ విద్యను జగనన్న విదేశీ విద్యగా మార్చుకుని దళితులకు అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని డీజీపీ చెబుతున్న దానికి, వాస్తవ పరిస్థితికి అసలు పోలికేలేదన్నారు. నిన్నగాక మొన్న బాపట్ల జిల్లాలో సోదరిని వేధిస్తున్న వ్యక్తిని ప్రశ్నించినందుకు ఒక గౌడ యువకుడిని దహనం చేయడం.. ప్రొద్దుటూరులో ఒక యువతి సామూహిక అత్యాచారం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నా రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని డీజీపీ చెబుతున్న తీరు సరికాదన్నారు. రాష్ట్రంలో క్రిమినల్ ఎంపైర్‌ను నేలమట్టం చేసి, సీఎంను రోడ్డు మీదకు తీసుకువస్తానన్నారు.

**నన్ను ఓడించడానికి రూ.200 కోట్లు ఖర్చు..:** ఇక భీమవరంలో ఉన్న ఓటింగ్ కంటే అధికంగా ఓటింగ్ జరిగిందని.. తనను ఓడించేందుకు రూ.200 కోట్లు ఖర్చుచేయాలనుకుంటున్నారని పవన్‌కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితిపై గతంలో జనసైనికులు ఫొటోలు తీసి దేశం దృష్టికి తీసుకువెళ్లినట్లుగానే హ్యాష్‌ట్యాగ్ ద్వారా ఇక్కడ జరుగుతున్న అవినీతి, దోపిడీపై ఫొటోలు తీసి కేంద్ర హోంశాఖ, రాష్ట్ర డీజీపీ, జనసేన కార్యాలయాలకు ట్యాగ్ చేయాలని ప్రసంగంలో పిలుపునిచ్చారు.

**ఎమ్మెల్యే ద్వారంపూడి లక్ష్యంగా..:** ఇక గంటంపావు సేపు సాగిన పవన్ ప్రసంగంలో మూడొంతుల సమయం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై విమర్శలే లక్ష్యంగా సాగింది. కాకినాడ పోర్టులో అక్రమంగా బియ్యం ఎగుమతుల ద్వారా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు.

## మళ్లీ అదరగొట్టారు

(మొదటి పేజీ తరువాయి)

నిలిచింది. ఆమెకు జనరల్ కేటగిరీలో 56వ ర్యాంకు వచ్చింది.

**టాప్‌లో ఐఐటీ హైదరాబాద్ జోన్..**

దేశంలో ఐఐటీలు, ఇతర జాతీయస్థాయి విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఐఐటీ గౌహతి ఆధ్వర్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహించగా.. ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 1,83,072 మంది పరీక్షలు రాయగా.. 43,773 మంది అర్హత సాధించారు. ఇందులో బాలురు 36,264 మంది, బాలికలు 7,509 మంది ఉన్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు గణనీయ సంఖ్యలో ర్యాంకులు సాధించారు. అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల పరిధి అధికంగా ఉన్న ఐఐటీ హైదరాబాద్ జోన్ టాప్‌లో నిలిచింది. ఈ జోన్ పరిధిలో 10,432 మందికి ర్యాంకులు వచ్చాయి. టాప్-500 ర్యాంకర్లలో 174 మంది ఈ జోన్ (తెలంగాణ, ఏపీతోపాటు తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి కలిపి)కు చెందినవారే. నాగర్ కర్నూల్‌కు చెందిన వావిలాల చిద్విలాసరెడ్డి మొత్తం 360 మార్కులకు గాను 341 మార్కులు స్యాధించి జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచాడు. గత ఏడాదితో పోల్చితే ఈసారి జేఈఈకి పోటీ ఎక్కువగా ఉందని.. పరీక్ష రాసిన వారి సంఖ్య, అర్హుల సంఖ్య పెరిగిందని నిపుణులు చెప్తున్నారు.

**నేటి నుంచే జోసా రిజిస్ట్రేషన్లు:** ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన 'జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా)'కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు దీనిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 30న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. మొత్తం 6 దశల్లో సీట్ల కేటాయింపు చేపడతారు.

## మౌలిక సూత్రాలకు లోబడే న్యాయవ్యవస్థ పనిచేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

న్యాయ వ్యవస్థ వ్యవహరించిన తీరు అభినందనీయమని కొనియాడారు. రాజ్యాంగంలో ఎన్నో మార్పులు చేర్పులు చేయవచ్చు కానీ ప్రాథమిక హక్కులను మార్పు చేయలేమన్నారు. రాజ్యాంగంలోని 21 ఆర్టికల్‌కు సవాలుగా ఎన్ని కేసులు వచ్చినా స్వేచ్ఛ, సమానత్వ మౌలిక సూత్రాలకు ఎలాంటి విఘాతం కలగలేద‌న్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రభుత్వాలు తమ ఎజెండా కోసం వాడుకోకుండా, వాటిని కాపాడే బాధ్యతను తీసుకోవాలని కోరారు.

**నిత్య విద్యార్థులమే..:** భారత రాజ్యాంగం ఒక గొప్ప గ్రంథమని, ఈ గ్రంథాన్ని అందించిన మహానుభావులకు మనం కృతజ్ఞతగా ఉండాలని సూచించారు. సుప్రీంకోర్టు ప్రతిష్ట పెంచిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారని, వారు తమ తీర్పులతో న్యాయవ్యవస్థకు గౌరవం తెచ్చారని గుర్తు చేశారు. న్యాయవిద్యలో ఎంత విజ్ఞానాన్ని సంపాదించినప్పటికీ నిత్య విద్యార్థులమేనని, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కర్ రావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీ దేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళి మోహన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి సుమలత, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏనుగు నరసింహారెడ్డి, ఐలు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.విద్యాసాగర్, నాగారం అంజయ్య పాల్గొన్నారు.

# మనందరం సీఎం కేసీఆర్‌కి ధన్యవాదాలు చెప్పాలి

## - అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అంబర్ పేట : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈరోజు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో అలీ కేఫ్ చౌరస్తాలోని SRG ఫంక్షన్ హాల్లో "మంచినీళ్ల పండుగ" కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారులను, సిబ్బందిని సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే అంబర్ పేటలో 400 కోట్లతో నిర్మిస్తున్న 212.5 %మీణ% సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించి, అధికారులతో మాట్లాడి పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి అలీ కేఫ్ చౌరస్తాలోని సభా వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కఠోర దీక్షతో 43,791 కోట్ల నిధులు వెచ్చించి తెలంగాణలో నూటికి నూరు శాతం గృహాలకు నల్లాల ద్వారా శుద్ధిచేసిన మంచినీటిని అందిస్తున్నారని చెప్పారు. ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోకెల్లా ప్రథమ స్థానంలో ఉందని, కృష్ణ, గోదావరి నదులతోపాటు ఇతర జలాశయాలను కలిపి, 1.30 లక్షల కిలోమీటర్లు పైపులైన్ల మార్గం ద్వారా తెలంగాణలోని 23,839 గ్రామీణ ఆవాసాల్లోని 57.01 లక్షల ఇళ్లకు, మున్సిపాలిటీలోల విలీనమైన మరో 649 గ్రామీణ ఆవాసాలు, 121 మున్సిపాలిటీలకు, అడవులు, కొండలపైన ఉన్న 136 గ్రామీణ ఆవాసాలకు మిషన్ భగీరథ స్వచ్ఛ జలాలు సరఫరా అవుతున్నాయని ఆయన వివరించారు. ఇప్పుడు హైదరాబాద్ మహా నగరంలో నీటి అవసరాలు తీర్చేందుకు సీఎం గారు అర్బన్ భగీరథకు శ్రీకారం చుట్టారని, మహానగరంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు ఉన్న 40 లక్షల మందికి తాగునీటి అందించడానికి దాదాపు రూ.1,900 కోట్ల వ్యయంతో శివారు మున్సిపాలిటీల్లో 56 రిజర్వాయర్లు, 2,000 కిలోమీటర్ల పైపులైన్ నిర్మిస్తున్నారని తెలిపారు. గత తొమ్మిదేండ్లలో హైదరాబాద్ మహానగర తాగు నీటి వ్యవస్థ కోసం కేసీఆర్ గారు రూ.7163 కోట్లను ఖర్చు చేశారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గారు వెల్లడించారు. ఇప్పుడు తాగునీటి కోసం మండుటెండలో బిందెలు నెత్తిన పెట్టుకొని మైళ్ళకుమైళ్ళ దూరం నడిచే దృశ్యాలు లేవు, ఖాళీ బిందెలతో ప్రజల ధర్నాలు లేవు, ఫ్లోరైడ్ నీరు తాగడం వల్ల ఫ్లోరోసిస్ బారినపడి ప్రజలు వికలాంగులుగా మారిన దృశ్యాలు మచ్చుకు కూడా నేడు లేవని అందుకని, మనందరం సీఎం కేసీఆర్ కి ధన్యవాదాలు తెలపాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్, నోడల్ ఆఫీసర్ ఆశా, డీఏంసీ వేణుగోపాల్, డీజీఎం విష్ణువర్ధన్, డీజీఎం సన్యాసి రావు తదితర అధికారులు, సిబ్బంది, బిఆర్ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, అనిల్, ఎర్రబొలు నరసింహారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు



## ఈ... నలుగురూ షార్ట్ ఫిల్మ్ స్క్రిప్ట్ పూజా కార్యక్రమం

సంతోష్‌నగర్: సూర్య చంద్ర లఘు చిత్ర ఫ్యాక్టరీ సమర్పిస్తున్న ఈ... నలుగురి షార్ట్ ఫిల్మ్ స్క్రిప్ట్ పూజా కార్యక్రమాన్ని సంతోష్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. యువతకు ఆదర్శంగా ఈ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నామని ఈ చిత్ర దర్శకుడు పల్లె మోహన్ చంద్ర ఆనందం వ్యక్తం చేశాడు. ఈ చిత్ర దర్శక పర్యవేక్షకుడు, నటుడు ప్రేమ్ రోహిత్ మాట్లాడుతు...ఈ కథా చిత్రంలో నేను నటించడం ఆనందంగా ఉందన్నాడు.మంచి కథాంశంతో నిర్మిస్తున్న ఈ . నలుగురి సందేశాత్మకమైన షాట్ ఫిల్మ్ అని ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు, సంగీత దర్శకుడు ఉదయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పూజా కార్యక్రమన్ని దేవాలయ ప్రధాన అర్చకులు నల్లదీగ శ్రీనివాసాచారి నిర్వహించి అందరిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమములో సీనియర్ నటుడు శివసత్యనారాయణ, వీర శివాజీ తదితరులు పాలుగొన్నారు.

## హైదరాబాద్‌లోని పాతబస్తీలో అర్ధరాత్రి కాల్పులు కలకలం



మీర్‌చౌక్: మీర్‌చౌక్‌లో ఇంటి కొనుగోలు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో మసూద్ అలీ అనే అడ్వకేట్ తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపాడు. అర్ఫాత్ అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం ఓ ఇంటిని కొనుగోలు చేశారు. అయితే ఈ విషయంపై గత కొన్ని రోజులుగా ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది.

ఆ ఇంటిపై కోర్టులో కేసు ఉండగా.. ఎలా కొంటారని పొరుగింటి వారు గొడవకు దిగారు. ఇదే విషయంపై ఇరువర్గాలు పోలీస్ స్టేషన్ లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. కోర్టును కూడా ఆశ్రయించారు. అయితే, గత శనివారం మరోసారి మీర్ చౌక్ పోలీస్ స్టేషన్ లో అర్ఫాత్ ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం అర్ధరాత్రి మసూద్ అలీ అనే అడ్వకేట్ అర్ఫాత్ తో గొడవ పడ్డాడు.అయితే, వారిని భయపెట్టేందుకు తన దగ్గరున్న తుపాకీతో మసూద్ అలీ గాల్లోకి కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## స్వరాష్ట్రంలో తాగునీటి కష్టాలకు చెల్లు

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.. ఇస్నాపూర్‌లో ఘనంగా మంచినీళ్ల పండుగ

పటాన్ చెరు : గత ప్రభుత్వాల హయాంలో బిందెడు మంచినీటి కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితుల నుండి పొయ్యి కాడికే మంచినీళ్లు అందించిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పటాన్చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన మంచినీళ్ల పండుగ కార్యక్రమాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర కాలనీ, మల్లికార్జున కాలనీ, కావ్య కాలనీలలో ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీటి నల్ల కనెక్షన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. దీని ద్వారా ప్రతి ఇంటికి ప్రతి రోజు ఉచితంగా రక్షిత మంచినీరు అందిస్తూ నీటి కష్టాలను రూపుమాపారని ఆనందం వ్యక్తం చేశారు. రక్షిత మంచినీరు తాగడం మూలంగా ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా తగ్గించడం జరిగిందని తెలిపారు.

ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం 100 శాతం విజయం సాధించిందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలతో పాటు నూతన కాలనీలకు సైతం మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఏర్పడే నాటికి పటాన్చెరు నియోజకవర్గంలో 10 వేల నల్ల కనెక్షన్లు ఉంటే నేడు 40 వేల కనెక్షన్లు అందించడం జరిగిందని తెలిపారు. కేవలం 9 సంవత్సరాల కాలంలో 30 వేల కనెక్షన్లు ప్రజలకు అందించిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ప్రతి ఇంటికి ప్రతి నెల 20 వేల లీటర్ల నీటిని ఉచితంగా అందిస్తూ మంచినీటిని ఆర్థిక భారంగా కాకుండా చేయడం జరిగిందని తెలిపారు. దీనితోపాటు దారిద్ర రేఖ దిగువన ఉన్న ప్రజలకు ఒక రూపాయికే నల్ల కనెక్షన్లు అందించి సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. అనంతరం నూతన పార్కును ప్రారంభించారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఉప సర్పంచ్ శోభ కృష్ణారెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, గ్రామీణ నీటిపారుదల విభాగం డిఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజు, గ్రామ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానం చేయడంతో మరొకరికి ప్రాణదానం

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు : అమీన్పూర్ మున్సిపల్ పరిధి సెంథన్ గ్రీన్ పార్క్ కాలనీలో భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని జ్యోతి వెలిగించి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు అవసరం ఉన్నవారికి రక్తాన్ని అందించేందుకు రక్తదాన శిబిరం నిర్వహించడం మంచి విషయం అన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు మరిన్ని నిర్వహించి ఇతరులకు ఉపయోగపడాలని ఆయన తెలిపారు. ప్రతీ ఒక్కరూ ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు అలాంటి వారికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు నీలం మధు ముదిరాజ్ ను రక్తదాన శిబిరం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు,ఈ కార్యక్రమంలో వి రాధాకృష్ణ, బసవరాజు శ్రీనివాస్, రామ సుధాకర్ శర్మ,ప్రశాంత్ రెడ్డి,మహేందర్ రెడ్డి, సర్వేశ్వర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## కాళభైరవి స్వామి ఆలయంలో ఉప్పల్ కార్పొరేటర్ రజిత పూజలు

ఉప్పల్, జూన్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి):-ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్ లోని కాళభైరవి స్వామి దేవాలయంలో కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఆలయంలో అమావాస్య అభిషేక హోమం,అన్నదానం,తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు శామీర్పేట్ వినోద్ రెడ్డి ,ఉపేందర్ ,పూజల లక్ష్మణ్,నిధానకవి సుధాకర్ ,దేవి రెడ్డి,లింగంపల్లి రామకృష్ణ ,సల్ల ప్రభాకర్ రెడ్డి,పాలడుగు లక్ష్మణ్ ,నర్సింహా,సురేష్ పాల్గొన్నారు

## ప్రైమరీ హై స్కూల్ పిల్లలకు సొంత ఖర్చులతో బుక్స్ అందజేత కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్



పిర్జాదిగూడ, జూన్ 18 (వాయిస్ టుడే ): పీర్జాదిగుడా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన స్కూల్ యూనిఫార్మ్స్ ,టెక్స్ట్ బుక్స్ ను అలాగే ప్రైమరీ స్కూల్,హైస్కూల్ వెయ్యి మంది విద్యార్థిని విద్యార్థులకు "టై బెల్ట్"లను 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి యాభై వేల రూపాయలు తన సొంత ఖర్చు తో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ 25వ డివిజన్ కాలనీ విహారిక, కాలనీ అధ్యక్షులు అశోక్ రెడ్డి, భాను ప్రకాష్, వరాజు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# ప్రతి ఇంటికి నీటినందించిన మహర్షి సీఎం కెసిఆర్

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్ జూన్ 18( వాయిస్ టుడే ) సోమాజిగూడ డివిజన్ డివిజన్లోని శ్రీనగర్ కాలనీ కమిటీ హాల్ లోని లి హెచ్ఎమ్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెలంగాణ మంచి నీళ్ల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదట ఎమ్మెల్యే హార్వెస్టింగ్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవతరణతో ప్రకృతి నియమాలకు అనుగుణంగా రాష్ట్రం మొత్తం ప్రతి ఇంటికి త్రాగునీరు అందించాలని కంకణ బద్ధుడై కార్యదీక్షతో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ మంచి నీరునందించిన మహర్షి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కృష్ణ నీళ్ల రాకతో ఎన్నో ఏళ్లుగా ఆడబిడ్డలు పడ్డ నీటి కష్టాలు కంటికి కూడ కానరాకుండా పోయాయన్నారు.నేడు తెలంగాణలో ప్రతి ఇంటి వాకిట్లో పుష్కలమైన నల్లా నీటితో ప్రతి ఇల్లు, ప్రతి మనసు పులకించాయన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎండి దాన కిషోర్ జిహెచ్ఎంసి బీసీ రమేష్ వాటర్ వర్క్స్ జిఎం హరికృష్ణ డిజిఎం వహాబ్ మేనేజర్ రాజేందర్ శ్రీనివాస్ రమేష్ శ్రీహరి జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్పొరేటర్లు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ దేదీప్యరావ్ రాజ్ కుమార్ పటేల్ సిఎన్ రెడ్డి బి ఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగొంతుక - మనచేతుక

హైదరాబాద్
సోమవారం 19 జూన్ 2023



## వరంగల్ వాసులారా.. జాగ్రత్త!

హనుమకొండ(వాయిస్ టుడే) ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పుల కొలిమిలా మారింది. వరంగల్, హన్మకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో తీవ్ర వడగాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



## బిసిల రిజర్వేషన్లు రాకుండా పాలకవర్గాలు చారిత్రాత్మక ద్రోహం చేశాయి

### బిసి రాజ్యాధికార సమితి

కరీంనగర్: ఆదివారం రోజున బీసీ రాజ్యాధికార సమితి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కడారి అయిలయ్య అధ్యక్షతన సంఘం కార్యాలయంలో జరిగినది. ఇట్టి సమావేశమునకు ముఖ్య అధితిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి లచ్చన్న హాజరై మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లు రాకుండా పాలకవర్గాలు బీసీలకు చేసిన చారిత్రాత్మక ద్రోహమే అన్నారు. రాజ్యాధికార సాధన ద్వారానే బీసీల సమస్యలు పరిష్కరించబడతాయని రాజ్యాధికారం ఒకరు ఇస్తే వచ్చేది కాదని పోరాడి సాధించుకోవడమే మార్గమని ఇది బీసీల ఐక్యతతోనే సాధ్యపడుతుంది అన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ సోదరులు కూడా బీసీలకు అనివార్యంగా సపోర్ట్ చేయవలసిన చారిత్రక బాధ్యత వారి పైన ఉన్నదని తెలియజేయడం జరిగింది. అలాగే బీసీ బంధు ప్రకటించి ప్రతి బీసీ కి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించవలసిందిగా సమావేశంలో డిమాండ్ చేయడం జరిగింది . ఇట్టి సమావేశమునకు రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు వంగ వెంకటేశ్వర్లు, కొండా రవీందర్ జంగా కొమురయ్య యాదవ్ జిల్లా కార్యదర్శి ఈరెల్ల విజయ్ కుమార్ పెద్దిరాజు సత్యనారాయణరాజు అనవేని శ్రీనివాస్ కనపర్తి రమేష్ ఒస్క ప్రవీణ్ కుమార్ గాజుల వేణు కుమార్ పెద్దపెల్లి సురేష్ కట్ట రాములు తదితరులు పాల్గొన్నారు.




## మేము సైతం

### Dr.G.S.R.చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమాలలో చురుకుగా పాలుగొంటామని కదిలిన మహిళలు

కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో, దివ్యా గారి సమక్షంలో G.S.R.ట్రస్ట్ సభ్యుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు. Dr.G.S.R.చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.శ్రీనివాసరావు గడల ఆధ్వర్యంలో ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న విద్యా,వైద్యం, ఉపాధి కల్పన,ఇంటింటికీ మొబైల్ హెల్త్ క్లినిక్ ద్వారా అందిస్తున్న అనేక ఉచిత సేవలు మరియు ఉచిత మంచి నీరు సరఫరా వంటి కార్యక్రమాలలో మేము సైతం పాలుగొని, కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంలోని మహిళలందరికీ అందే విధంగా కృషి చేస్తామని, Dr.G.S.R.ట్రస్ట్ కు అండగా ఉంటామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సుజాత,విజయలక్ష్మి,అనేక మంది మహిళలు ట్రస్ట్ కో ఆర్డినేటర్ మోదుగు.జోగారావు తదితరులు పాల్గొన్నారు,



## వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఎస్ఐ మృతి

వరంగల్, జూన్ 18: వరంగల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఒకరు మృతి చెందాడు. వరంగల్- నర్సంపేట ప్రధాన రహదారులో గీసుకొండ మండలంలోని హర్జితండా వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గీసుకొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సోమ కుమారస్వామి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎస్ఐగా పనిచేస్తున్నాడు. ఆదివారం కారులో వరంగల్ కు వస్తుండగా కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో అందులో ఉన్న ఎస్ఐ కుమారస్వామి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దేశంలో సస్యశ్యామలంగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

## నీరే జీవధారం నీరు లేకుంటే జీవనమే ప్రశ్నార్థకం .. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి మంచినీరు

-తెలంగాణ రాష్ట్రం రాకముందు నీళ్ల కోసం అరిగోస పడ్డాం
- నేడు బ్రహ్మాండంగా నీళ్లు
-కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులన్నీ నిండి మండుటెండల్లో సైతం నీళ్లు మత్తడి దునుకుతున్నవి
- భూమికి బరువైనంత పంటలు పండుతున్నాయి
- రైతులకు కరెంట్ బిల్లు, నీటి పన్ను, భూమిశిస్తూ లేదు
-రాష్ట్ర బీసీ సంక్షేమం పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, జూన్ 18 (వాయిస్ టుడే): భారతదేశంలో సస్యశ్యామలంగా ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి పల్లెకు, గ్రామాలకు నాణ్యమైన త్రాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం లోని ఎలగందల్ ఫిల్టర్ బెడ్ వద్ద నిర్వహించిన తెలంగాణ మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రాకముందు సమైక్య రాష్ట్రంలో నీళ్ల కోసం అరిగోస పడ్డామని, గోదావరి ప్రక్కనుండి పోయేదని కానీ తెలంగాణలో ఆగేది కాదని

బావులు, బోర్లు ఎండిపోయావని నీళ్ల కోసం మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి బిందె మీద బిందె పెట్టుకొని నీళ్లు తీసుకొని వచ్చే వారని నీళ్లు లేక, కరెంటు లేక ప్రజలు అరిగోస పడ్డారని అన్నారు.రాష్ట్ర ఆవిర్భావానికి పూర్వ%శీ% తెలంగాణలో ఎక్కడా చూసిన నెర్రలు బారిన చెరువులు, ఎండిపోయిన బావులు, నీటికోసం కిలోమిటర్ల కొద్ది దూరంపోయి నీళ్లను బిందేలలో ఎత్తుకొని వచ్చే పరిస్థితులు తెలంగాణాలో సాక్షత్కరించేవని అన్నారు. వర్షాకాలంలో కూడా అల్లంతదూరానా మానేరులో కనిపించే నీళ్లు, పంటపోలాలకు నీళ్లుపెట్టాలంటే లోఫేస్ కరెంటుతో నిత్యం కాళిపోతున్న ట్రాన్స్ ఫార్మర్లు, మోటార్లే కనిపించేవని, పంటకు నీరు అందించలేక ఎండిపోతున్న పంటను పశువులకు గ్రాసంగా అదించిన రోజులను చూశామన్నారు. తెలంగాణను ఆనుకొని గోదావరి ప్రవహిస్తున్న, సింగరేణి బోగ్గు గనులు నిక్షేపంగా ఉన్న వాటిని ఏమాత్రం తెలంగాణా రాష్ట్ర అభివృద్ధికి ఏమాత్రం వినియోగించబడలేదని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మంచి నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారాన్ని చూపేలా 2015 లో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టిందని, అదే విధంగా ప్రధాన రిజర్వాయర్లలోని 19 నీటిని తోడే బావులు, 50 మంచినీటిని శుద్ధిచేసే కేంద్రాలు, 2983 నీటిని తోడే పంపులు మరియు 56 వేల కిలో మీటర్ల ప్రధాన పైపులైన్లు ప్రధాన ట్యాంకులను నిర్మించుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 100 లీటర్లు, మున్సిపాలిటీలలో 135 లీటర్లు, కార్పోరేషన్ల పరిదిలో150 లీటర్ల నీటిని ప్రతిఒక్కరికి అందించుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భావాని పూర్వం 17 వెల నీటి ట్యాంకులు, 10 వేల కి.మీ. అంతర్గత పైపులైన్లు మాత్రమే నిర్మిస్తే, మిషన్ భగీరథ పథకం ద్వారా 18,560 నీటి ట్యాంకులు, 67 వేల కి.మి. అంతర్గత పైపులైన్లను మరియు 57 లక్షల నల్లా కనెక్షన్లను నిర్మించుకొని, ఇటింటికి నీరందించుకోవడంతో 2022 లో నిత్య నీటి సరఫరాల చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ అవార్డ్ ను గెలుచుకొందన్నారు.

గతంలో పంటను సాగుకు ముందు రైతు బ్యాంకుదగ్గర అప్పుతీసుకువస్తే, సరైన నీరు లేక ఆరైతు అప్పును తీర్చపోవడంతో అప్పుకు అప్పుపెరిగి వడ్డికూడా కట్టలేని పరిస్థితులు ఎదురైతే, ఆప్పులు ఇచ్చిన బ్యాంకులు మాత్రం ఆరైతు ఇంటి తలుపులు గుంజుకుపోవడం వంటివి చూసామని, అప్పుల పాలై రైతు ఆత్మహత్మ చేసుకుంటే అయ్యే అని అనుకున్నామే తప్ప ఎటువంటి సహాయాన్ని ఎవరు అందించలేదన్నారు. ఇంటి ఆడబిడ్డ పెళ్లి బారమై అయినవాళ్లు, కానివాళ్ల దగ్గర అప్పులు తెచ్చి ఆస్థులు కుదువపెట్టే రోజులు కనిపించేవని, చదువుకోవాలన్న ఆర్థిక పరిస్థితులు సహకరించక కూలీ పనులకు పోయో యువతను చూశామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడంతొ ఒక్కసారిగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, తిరిగి ఇవ్వనవసరం లేకుండా, పంటను సాగుచేసే ప్రతిరైతుకు రైతుబందును అందించుకుంటున్నామని, ఎదైన కారణంచేత రైతు మరణిస్తే ఆరైతు కుటుంబ ఆగం కాకుండా రైతుభీమాను అందించుకోవడం జరుగుతుందన్నారు. ఆడబిడ్డ పెళ్లి భారం కాకుండా ఉండేందుకు కళ్యాణలక్ష్మీ పథకాన్ని అందించామని, ఎక్కడా ఇప్పటి వరకు లేని విధంగా పుట్టబోయో బిడ్డ, తల్లి ఆరోగ్యం బాగుండాలని ఉద్దేశంతో న్యూట్రిషన్ కిట్ లను అందించుకోవడం జరుగుతుందని తెలిపారు. కుల, మత, వర్గాలకు తావులేకుండా బావితరాలకు గుర్తుండిపోయోలా అందరం సంతోషంగా జరుపుకునే దశాబ్ది ఉత్సవాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ అమరేందర్, ఈఈ రామ్ కుమార్, డి ఏ ఓ నాగ సిద్దేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రెడ్డవేణి మధు , కొత్తపల్లి మున్సిపల్ చైర్పర్సన్ రుద్రరాజు, యంపిపి లు టి.లక్ష్మయ్య, పిల్లి శ్రీలత, జెడ్ పి టి సి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గోన్నారు.



ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి 9 సంవత్సరాల పాలన సందర్భంగా నిర్వహిస్తున్న మహా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ పార్లమెంట్‌లో పర్యటిస్తున్న జమ్ము కాశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్ సింగ్ ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఇంటికి విచ్చేసిన నిర్మల్ సింగ్‌కి స్వాగతం పలికి ఆహ్వానించిన బిజెపి నాయకులు కార్యకర్తలు. - వరంగల్ తూర్పు (వాయిస్ టుడే)

## పలువురికి పరమర్శ ఎమ్మెల్యే చందర్



గోదావరిఖని (వాయిస్ టుడే న్యూస్) అంతర్గాం గ్రామానికి చెందిన బియ్యాల భూమయ్య తండ్రి ఇటివల స్వర్గస్తులయ్యారు వారి కుటుంబాన్ని అదివారం రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్ పరమర్శించారు. విల్లేజ్ అంతర్గాం చెందిన వెంకటేష్, రమేష్ లు ప్రమాదంలో కాలుకు గాయం కావడంతో వారిని కూడా ఎమ్మెల్యే పరమర్శించారు. ఎమ్మెల్యే తో పాటు వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి సర్పంచ్ తుంగపిండి సతీశ్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్ నాయకులు కొలిపాక మధుకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# బిఆర్ఎస్ అంటే తూర్పు తూర్పు అంటే బిఆర్ఎస్ అనే విదంగా బిఆర్ఎస్ పార్టీని నిలబేడతాం

**బిఆర్ఎస్ పార్టీ ప్రతి ఒక్కరినీ కడుపులో పెట్టుకోని చూసుకుంటుంది**

**నా మాటపై పిలవగానే వచ్చిన 50వేల మంది పైచిలుకు ప్రజలకు రుణ పడి ఉన్నాం**

**-నన్నపునేని నరేందర్**



వరంగల్ (వాయిస్ టుడే): వరంగల్ తూర్పు నియోజకవర్గంలో శనివారం రోజున మంత్రి కేటీఆర్ గారు విచ్చేసి 618 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవాలు చేసి భారీ బహిరంగ సభ విజయవంతం అయిన సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ నేడు ఓసిటీ లోని నూతన క్యాంపు కార్యాలయం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేటీఆర్ గారి ఓరుగల్లు పర్యటన వరంగల్ కు మహర్దశ వచ్చింది. నియోజకవర్గ రాజకీయానికి దశ దిశ ఇవ్వడం మంచి పరిణామం బతుకమ్మ, బోనాలు, వాయిధ్యాలు, డప్పు చప్పులతో పెద్ద ఎత్తున కేటీఆర్ గారికి స్వాగతం పలికి సభ నిర్వహించుకోవడం శుభసూచికం.

సభ నిర్వహణ జన సంద్రాన్ని చూసి మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మంచి గా పని చేసుకుంటున్నావ్ అని మంత్రి కితాబు ఇచ్చారు. నియోజకవర్గంలో అందరూ సమిష్టిగా పని చేసి అభివృద్ధి కార్యాక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవం,సభ నా భూతొ నా భవిష్యత్తులా నిర్వహించాం. కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు, ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ఇంచార్జ్ బాద్యులు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు. రాబోవు రోజుల్లో ప్రజల అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకొని పోతాం. నియోజకవర్గానికి విచ్చేసి 618కోట్ల పనులను శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన కేటీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు. నిన్న రోజు మొత్తము నియోజకవర్గానికి కేటాయించిన మంత్రి కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావుకు ధన్యవాదాలు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభించి మా ఆతిధ్యం స్వీకరించిన మంత్రికి కృతజ్ఞుడిని కలెక్టర్,పోలీసు అధికారులకు కృతజ్ఞతలు. ఈ కార్యక్రమానికి సహకరించిన కార్పొరేటర్లు, మాజీకార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ఇంచార్జ్ బాద్యులు,యూత్ నాయకులు మహిళ నాయకురాలులు, మీడియా ప్రతినిధులు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,ముఖ్య నాయకులు, హాజరయ్యారు

# రిటైర్డ్ యం.పి.డి.ఓ హత్యకు పాల్పడిన గ్యాంగ్ సభ్యుల అరెస్టు

వరంగల్: మూడు రోజుల క్రితం బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ యం.పి.డి.ఓ. నల్లా రామకృష్ణయ్య (వయస్సు70)ను కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేసిన సుఫారీ గ్యాంగు చెందిన ఐదుగురు సభ్యుల ముఠాలోని ముగ్గురు నిందితులను బచ్చన్నపేట మరియు టాస్కోఫర్స్ పోలీసులు సంయుక్తంగా కల్సి అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. అరెస్టు చేసిన నిందితుల నుండి పోలీసులు ఒక కారు, మూడు సెల్ఫోన్లు, పదిహేనువేల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1.గిరబోయిన అంజయ్య, తండ్రిపేరు ఆగయ్య, వయస్సు 55, గోపాల్ నగర్, బచ్చన్నపేట మండలం, జనగామ జిల్లా, 2. డోలకొండ శ్రీకాంత్, తండ్రిపేరు నర్సయ్య, వయస్సు 22, బచ్చన్నపేట, జనగామ జిల్లా 3.శివరాత్రి బాషా, అలియాస్ భాస్కర్, తండ్రి పేరు శంకరయ్య, వయస్సు 27. బచ్చన్నపేట, జనగామ జిల్లాకు చెందిన వారుకాగా ప్రస్తుతం పరారీలో వున్న నిందితులు బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన దండుగుల తిరుపతి, దండుగుల రాజు వున్నారు.

ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వివరాలను వెల్లడిస్తూ నిందితుల్లో ప్రధాన నిందితుడైన గురబోయిన అంజయ్యకు చెందిన భూములకు సంబంధించి కొద్ది రోజులుగా గోడవలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సర్వే నం 174 భూములకు సంబంధించి మృతుడు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసి మృతుడు నల్లా రామకృష్ణ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు అనే అక్కసుతో మృతుడు రామకృష్ణయ్యను హత్య చేసేందుకు అంజయ్య సిద్ధపడ్డాడు. ఇందుకోసం అంజయ్య, తిరుపతిలకు గతంలో పరిచయం వుందడంతో రామకృష్ణయ్య అంతమొందిస్తే 8 లక్షలు రూపాయలు ఇస్తానని ప్రధాన నిందితుడు అంజయ్య మరో నిందితుడు తిరుపతితో



ఒప్పందం చేసుకోవడంతో పాటు, అందుకు అంగీకరించిన తిరుపతి అంజయ్య నుండి 50వేల రూపాయలు అడ్వాన్సు తీసుకోవడం జరిగింది. రామకృష్ణయ్య హత్య చేసేందుకు నిందితుడు. తిరుపతి మరో ముగ్గురు నిందితులు తన దగ్గరి బంధువులైన డోలకొండ శ్రీకాంత్, శివరాత్రి బాషా, ఆలియాస్ భాస్కర్, దండుగుల రాజు సహాకారాన్ని తీసుకున్నాడు. ఈ హత్యలో భాగంగా ఈ నలుగురు నిందితులు ఈ నెల 15వ తేదిన ఒక కారును తీసుకోని సాయంత్రం 5.30 నిమిషాలకు పోచన్నపేట గ్రామ శివారు ప్రాంతంలో బచ్చన్నపేట నుండి పోచన్నపేటకు వెళ్ళుతున్న మృతుడు రామకృష్ణయ్యను నిందితులు నలుగురు బలవంతంగా కారులోకి ఎక్కించుకోనిపోయి, సుమారు అదేరోజు సాయంత్రం 6.30 నిమిషాలకు చిన్నరామన్చర్ల గ్రామ శివారు ప్రాంతంలో నిందితులు మృతుడు రామకృష్ణయ్య కారు నుండి దింపి టవల్తో మృతుడి మెడను బిగించి ఊపిరి అడకుండా చేసి రామకృష్ణయ్య దారుణం హత్య చేసారు. హత్య అనంతరం నిందితులు రామకృష్ణయ్య మృతదేహాన్ని కారు డిక్కీలో పెట్టి ఓబుల్ కేశవాపూర్, పెద్దపహాడ్ మీదుగా చంపక్ హిల్స్ ప్రాంతంలోని క్వారీ నీటిగుంటలో రామకృష్ణయ్య మృతదేహాన్ని పడవేసి నిందితులు అక్కడి నుండి బచ్చన్నపేటకు చేరుకోని రామకృష్ణయ్య హత్య చేసినట్లుగా ప్రధాన నిందితుడు అంజయ్యకు సమాచారం అందించి కారును అంజయ్య ఇంటి ముందు వుంచి నిందితులు వెళ్ళిపోయారు. నిందితుడు గతంలో అక్టోబర్ మాసంలో సుభద్ర అనే మహిళను సుపారీ గ్యాంగ్ కు రెండున్నర లక్షల రూపాయలు సుపారితో హత్య చేయించాడు. పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించడం జరిగింది. ఇందులో ప్రధాన నిందితుడు అంజయ్య. పోలీసులు అరెస్టు చేయగా అంజయ్య ఇచ్చిన సమాచారం మేరకు మిగితా ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసారు.

ఈ హత్య కేసును చేధించడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ డిసిపి సీతారాం, జనగామ ఏసిపి దేవేందర్ రెడ్డి, ఫోర్స్ ఏసిపి జితేందర్ రెడ్డి, నర్మెట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగబాబు, బచ్చన్నపేట ఎస్.ఐ నవీన్, టాస్కోఫర్స్ ఇన్స్పెక్టర్ రాంబాబు, ఎస్.ఐ దేవేందర్, శరత్తో పాటు టాస్కోఫర్స్ ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.




## అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఆర్వోబి పనులపై బిజెపి,బిఆర్ఎస్ రాద్ధాంతం

### ఎంపి బండి సంజయ్,మాజీ ఎంపి వినోద్ కుమార్ అసమర్థత వల్లే జాప్యం

### రైల్వేట్రాక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టిన నగర కాంగ్రెస్

కరీంనగర్ జూన్: 18( వాయిస్ టుడే): ఆర్వోబి నిర్మాణం విషయంలో బిజెపి,బిఆర్ఎస్ నాయకుల అసమర్థతను కప్పిపుచ్చుకోవడం కోసం ఇరుపార్టీల నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరోపించారు.బిజెపి,బిఆర్ఎస్ నాయకుల వైఖరిని ఖండిస్తూ రైల్వే ట్రాక్ వద్ద నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఒకవైపు ఇబ్బంది పడుతుంటే జాప్యానికి కారణం మీరంటే మీరని ఒకరిపై మరొకరు నెట్టేసి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.ఎంపి బండి సంజయ్ కుమార్,మాజీ ఎంపి వినోద్ కుమార్ అసమర్థత వల్లే ఆర్వోబికి నిధులు మంజూరు కాలేదని నరేందర్ రెడ్డి అన్నారు. రోజు కొన్ని వేలమంది ప్రయాణీకులు ఇబ్బంది పడుతుంటే స్కూలు బస్సులు అంబులెన్సులు నిలిచి పోతుంటే చిత్తశుద్ధి లేని నాయకులు సంవత్సరాల కొద్ది జాప్యం చేసి మాఘనత అంటే మాఘనత అని ప్రకటలిచ్చుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.ఇప్పటికయినా ప్రజల ఇబ్బందుల పై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే పనులు ప్రారంభించాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మెతుకు కాంతయ్య,ఎండి తాజ్, శ్రవణ్ నాయక్,సమద్ నవాబ్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,గడ్డం విలాస్ రెడ్డి,కుర్ర పోచయ్య, ఖమ్రొద్దిన్,దండి రవీందర్,దన్నసింగ్, బత్తిని చంద్రయ్య,అబ్దుల్ భారీ,షబానా మహమ్మద్,ఊరడి లత,మామిడి సత్యనారాయణ రెడ్డి,ముక్క భాస్కర్,సలీమొద్దిన్,షేక్ షేహన్ష,ఎగ్గడి శారద,నిహాల్ అహ్మద్,కంకణాల అనిల్ కుమార్,బొబ్బిలి విక్టర్,అన్న జ్యోతి,నెల్లినరేష్,నదీమ్,గంగుల దిలీప్ కుమార్, కుంబాల రాజ్ కుమార్,హనీఫ్, ఇమామ్,ఎండి బషీర్ దామోదర్, సాయిరాం, ఆంజనేయులు,జిలకర రమేష్ పాల్గొన్నారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్డ్ సర్టిఫికెట్ పరిశీలన!



గోదావరిఖని (వాయిస్ టుడే న్యూస్) రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి ఐపిఎస్., (డిఐజి) ఏ ఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హాక్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పరిశీలన కొనసాగుతుంది. ఈరోజు పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ ఐపిఎస్., సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పరిశీలించి అధికారులకు, సిబ్బంది పలు సూచనలు చేయడం జరిగింది. రెండో రోజు 651 అభ్యర్థులకుగాను 568 మంది, మూడవ రోజు(ఈరోజు) 650 అభ్యర్థులకుగాను 568 మంది హాజరయ్యారు. వెరిఫికేషన్ కు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా తమతోపాటు వెరిఫికేషన్ లెటర్ సంబంధిత ధ్రువపత్రాల ఒరిజినల్స్, ఒక జిరాక్స్ సెట్ తీసుకొని, తమకు కేటాయించిన రోజు రావాలని డీసీపీ అన్నారు. కార్యక్రమములో ఏ ఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హాక్, ఏఆర్ ఏసీపీ సుందర్ రావు, ఆర్ఐ లు మధుకర్, శ్రీధర్, ఏవో నాగమణి, డీపీఓ సిబ్బంది, ఆర్టీఓ సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ నీరు ఆరోగ్యానికి గొప్ప వరం: ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని.(వాయిస్ టుడే న్యూస్) తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం అంతర్గాం ముర్మురులోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద నిర్వహించిన తెలంగాణ మంచినీళ్ళ పండుగ దినోత్సవ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ తో కలిసి పాల్గొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీటి సరఫరా అందడంపై రూపొందించిన , ముర్మురు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా శుద్ధి చేసిన నీటి సరఫరా అనుసరించే విధానం పై రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ ఖాళీ బిందెల ప్రదర్శనలు , నిరసనలు ఉండేవని. అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, అంతర్గాం ఎంపిపి దుర్గం విజయ జెడ్పిటిసి ఆముల నారాయణ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మిషన్ భగీరథ గ్రిడ్ అధికారి కె. పూర్ణచందర్, మిషన్ భగీరథ అధికారులు, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఫణింద్ర, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పలు కుటుంబాలను పరామర్శించిన బీర్ల ఐలయ్య

ఆలేరు, జూన్18(వాయిస్ టూడే): మండలం మందనపల్లి గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బీర్ల ఐలయ్య అన్నం పెద్దసిద్ధులు గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతుండగా,అదే గ్రామానికి చెందిన కడకంచి థర్మల్ సిద్ధులు రోడ్డు ప్రమాదంలో గాయపడగా,కర్రె మణికంఠ కు గడ్డి చుట్టే మిషన్ తో ప్రమాదం జరిగి గాయపడగా వీరి అందర్నీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బీర్ల ఐలయ్య పరామర్శించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.విరితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## దుర్గాభవానీ అమ్మవారికి ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు

కరీంనగర్ జూన్ 18(వాయిస్ టుడే )కరీంనగర్ మండలం నగునూర్లోని దుర్గాభవానీ ఆలయంలో నిర్వహిస్తున్న ఆషాడమాసం శాఖాంబరీ ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని దుర్గాభవానీ అమ్మవారికి ఆలయ ధర్మాధికారి వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఫలపంచామృతాభిషేకం, విశేష హారతులు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శాఖాంబరీ ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తు ధ్వజారోహణ పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఓడిబియ్యం, చీరెసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వైశ్య భవన్లో 1999-2000 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన మిలినియం మిస్ఫెల్స్ విద్యార్థులు అందరూ కలిసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా పూర్వవిద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి,తరగతి గదిలో కూర్చొని పాఠశాలలో చదువుకున్న చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల ఆశీస్సులు తీసుకుని వారిని శాలువా,మెమోంటోతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఆటపాటలతో,సాంస్కృతిక కార్యక్రమాలతో పూర్వవిద్యార్థులు సంతోషంగా గడిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామయ్య,భూమిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,మంజుల,పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

## మల్కాపూర్ గ్రామంలో 364వ స్వచ్ఛభారత్ కార్యక్రమం



మెదక్ తూప్రాన్ వాయిస్ టుడే న్యూస్ : మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని 6 వ వార్డులో చేపట్టడం జరిగింది. పరిసర ప్రాంతాలను, సిసి రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు.అలాగే చెట్లకు పాదులు చేశారు. గ్రామంలో ఇప్పటివరకు నిరంతరాయంగా 364 వారాలుగా స్వచ్ భారత్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని సర్పంచ్ మహాదేవి ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, పంచాయితీ కార్యదర్శి మహేందర్ రెడ్డి,ఐకెపి వి వో ఎ సంతోష, మెకిన్ యూత్ ఉపాధ్యక్షులు పాప సీన్ లు, ప్రజా ప్రతినిధులు తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సురేష్, పాలకవర్గ సభ్యులు, ,మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## 2,50,000 వేల రూపాయల ఎల్ఓసి కాపీని అందజేసిన వంటేరు ప్రతాప్ రెడ్డి

మెదక్ తూప్రాన్ 18 జూన్ (వాయిస్ టుడే): మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఘనపురం గ్రామానికి చెందిన మైసవ్వ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చేరడం జరిగింది చికిత్స చేయించుకోవడం కోసం మైసవ్వ దగ్గర ఆర్థిక ఇబ్బందులు ఉండడం తో ఈ విషయాన్ని ఘనపూర్ గ్రామస్తులు స్థానిక బి అర్ ఎస్ పార్టీ నాయకులు బద్దం మహేష్ తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి గారి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన వంటేరు ప్రతాప్ రెడ్డి గారు మైసవ్వ వైద్య చికిత్సల నిమిత్తం ఎల్ఓసి కాపీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయించి ఈరోజు మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి కాపీని మైసవ్వ కుటుంబ సభ్యులకు ఘనపురం గ్రామంలో అందజేసిన తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజల ఆరోగ్యానికి ఒక సంజీవని లాంటిది అన్నారు కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స చేయించుకుని నిరుపేదలకు ఎల్ఓసి ఒక వరం లాంటిది అన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలను భారతదేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారన్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ తరహా హాస్పిటల్ నిర్మాణం చేసి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు నిత్యం కృషి చేస్తున్నారన్నారు, పట్టణాలలో జిల్లా ఆస్పత్రులు, పల్లెలలో బస్తి దవఖానాలు ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ది అన్నారు, కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ సహకరించకపోయినా, కక్ష సాధింపులు చర్యలు చేసిన కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్పిటల నిర్మాణం, మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ గారిది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు బద్దం మహేష్ పటేల్, గొల్లపల్లి మహేష్ , వీరేష్ యాదవ్ శివ యాదవ్ బాలరాజు యాదవ్ షేక్ రఫి స్వామి శ్రీను యాదవ్, రఫీ, ప్రజా ప్రతినిధులు యువకులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

మక్తల్ జూన్ 18 (వాయిస్ టుడే): మక్తల్ పట్టణంలో వట్టం రవి కన్వెన్షన్ హాల్ ,వెంకటేశ్వర లాడ్జింగ్ ,వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ యజమానులు వట్టమ్ రతన్ కుమార్ గుప్తా, వట్టం వెంకటేష్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తండ్రి వట్టం శేఖరయ్యను శాలువా కప్పి సత్కరించారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత చిన్నారులు వట్టం నిక్షయ, వట్టం సత్య రవి. తమ తండ్రి వట్టం రతన్ తో పాటు పెదనాన్న వట్టం వెంకటేష్ లను శాలువా కప్పి సత్కరించి.కేక్ కట్ చేయించారు అనంతరం శుభాకాంక్షలు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ప్రతి ఒక్కరి జీవితంలో తండ్రి పాత్ర ఎనలేనిదని, పిల్లల ఎదుగుదల వెనుక తండ్రి శ్రమ ఎంతో ఉంటుందని అన్నారు. ఆ తర్వాత సిబ్బంది సమక్షంలో వేడుకలు నిర్వహించారు అనంతరం ఇంటిల్లిపాది కలిసి సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో వట్టం పుష్పవతి, వట్టం అనూష, తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఇంటింటికి మంచినీళ్ళు ఇస్తున్న అపరభగీథుడు ముఖ్యమంత్రి కెసిఆర్ : మంత్రి కొప్పుల



జగిత్యాల జిల్లా ప్రతినిధి (జూన్ 18,23)వాయిస్ టుడే :ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల కేంద్రంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ మంచి నీళ్ల పండుగ కార్యక్రమంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.ధర్మారం కేంద్రంలోని వాటర్ ఫిల్టర్ బెడ్ ను స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి పరిశీలించి నీటి సరఫరా జరుగుతున్న తీరును అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12,729 గ్రామాలకు మిషన్ భగీరథ కార్యక్రమం రూపొందించి, సురక్షితంగా మంచి నీటిని ఇంటింటికీ అందిస్తున్న అపరభగీరథుడు మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అలాగే ధర్మారం లో గల వాటర్ ప్లాంట్ ద్వారా ధర్మారం మండలం తో పాటు, వెల్గటూర్ మండలానికి త్రాగునీరు అందిస్తున్నామన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో నాడు తెలంగాణలోని ప్రతి పల్లె త్రాగు నీటికి పశుపక్ష్యాదులు కూడా నీటికి అరిగోసలు పడ్డామని, మంచి నీటి బావులు, బోర్లు ఎండిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డామని, ఎక్కడికో దూరాన ఉన్న బావులు, చెరువులు, కుంటలకు వరుసలు కట్టి వంతుల వారీగా నీటిని తెచ్చుకున్నా సరిపోయేటివి కాదని అలాంటి పరిస్థితి నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మంచి నీటి కష్టాలు తీరాలని మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ త్రాగు నీరు అందిస్తున్నారని ఈ రోజు ప్రతి గ్రామంలో ప్రతి ఇంట్లోకి మిషన్ భగీరథ నీరు వచ్చి ప్రజల కష్టాలు తీరి మహిళలు సంతోషంగా ఉన్నారంటే దానికి మన సీఎం కేసిఆర్ దార్శనికత కు నిదర్శనం అని అన్నారు.పల్లెలు,పట్టణాలు అనే తేడా లేకుండా దేశంలోనే ఎక్కడ లేని విధంగా ప్రతి ఒక్క ఇంటికీ ఉచితంగా స్వచ్ఛమైన,సురక్షితమైన త్రాగు నీటిని మన తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నది అని అన్నారు.దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మిషన్ భగీరథ పథకం తీసుకువచ్చి పేద ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణ శ్రీ, జెడ్పిటిసిలు పద్మజ,సుధారాణి, సింగిల్ చైర్మన్ బలరాంరెడ్డి తోపాటు మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఐతారం అంగడి అనే పాట చిత్రీకరణ

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (వాయిస్ టుడే): ఆదివారంరోజున ఏ.ఎస్ స్టూడియో యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో ఐతారం అంగడిఅనే సరికొత్త పాటను వేములవాడ రాజన్నసన్నిధిలో ఉదయం పాట చిత్రించగా వేములవాడనృత్యకళానికేతన్ సేవాసంస్థ వ్యవస్థాపకఅధ్యక్షులు యెల్ల పోశెట్టి జ్యోతివెలిగించి కొబ్బరికాయకొట్టి పాటచిత్రీకరణ ప్రారంభించడం జరిగింది. గేయ రచయిత, డైరెక్టర్ నాగం పరుశురాం, హీరో కంబల పరశు రాం, హీరోయిన్ డి.అఖిల, కెమెరామెన్ నరేష్ వేల్పుల, నిర్మాత మరియు కొరియోగ్రాఫర్ మాస్టర్ గంగశ్రీకాంత్, మరియు కనికరపు అనిల్ కుమార్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రణలో పాల్గొన్న డైరెక్టర్ కు, నిర్మాతకు, కొరియోగ్రాఫర్ కు,కెమెరామెన్, హీరో హీరోయిన్లకు యెల్ల పోశెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రిపోర్టర్ లింగప్ప కు సన్మానించిన ముదిరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు

మక్తల్ జూన్ 18 (వాయిస్ టుడే): నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ వాయిస్ టుడే రిపోర్టర్ లింగప్పను ముదిరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యాదగిరి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ లింగప్ప ఇలాంటి జన్మదిన వేడుకలను ఇంకా మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాము, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాచౌక్ ఎత్తివేతను విరమించుకోవాలి

**- ధర్నా చౌక్ ప్రాంతంలో రేపు ఉదయం హరితహారం మొక్కలు నాటడాన్ని అడ్డుకుంటాం**

**- ధర్నా చౌక్ స్థలము లేకుండా చేస్తే కలెక్టర్ క్యాంపు కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలను చేపడతాం :ప్రజా సంఘాల హెచ్చరిక**



భువనగిరి, జూన్ 18: (వాయిస్టుడే) జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చౌక్ ఎత్తివేతను తక్షణమే విరమించుకోవాలని , ధర్నా చౌక్ ప్రాంతంలో రేపు ఉదయం హరితహారం మొక్కలు నాటడాన్ని అడ్డుకుంటామని దానితో విరమించుకోకపోతే ధర్నా చౌక్ స్థలంలో లేకుండా చేస్తే కలెక్టర్ క్యాంపు కార్యాలయం ముందు ప్రతిరోజు నిరసన కార్యక్రమాలను చేపడతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని హెచ్చరించినారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ప్రజాసంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ నూతన భవనము ప్రారంభమైనప్పటి నుండి కలెక్టరేట్ ముందు భాగము వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడానికి నిరసనలు తెలియజేసి, ధర్నాలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధర్నా చౌక్ ను ఎత్తివేయడానికి నిరసిస్తూ ధర్నా చౌక్ ప్రాంతంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జిల్లా కార్యదర్శులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా హక్కుల పరిష్కారం కోసం, మన కోసం మనం ఏర్పాటు చేసుకున్న మన తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు పాలకుల, అధికార యొక్క నిరంకుశ తత్వము పెరిగిపోతుందని ఆవేదన వెలిబుచ్చారు. హక్కులను అడిగిన, నిరసన తెలిపిన భరించలేని పరిస్థితులలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, వారికి అనుగుణంగా జిల్లా యంత్రాంగము ఉన్నారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని దానిని కాలరాస్తూ ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించడం సరికాదని అన్నారు. గతంలో ఈ జిల్లా కలెక్టర్ లాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా హైదరాబాదులో ఉన్న ధర్నా చౌక్ ను ఎత్తివేస్తే రాష్ట్ర ప్రభుత్వం పై హైకోర్టు మొట్టికాయ వేసిందని అదొకసారి జిల్లా యంత్రాంగం గమనించాలని తెలియజేశారు. గతంలో నిరసనలు తెలియజేయడానికి ధర్నాలు చేయడానికి కలెక్టరేట్ ముందు భాగంలో ధర్నా చౌక్ బోర్డును ఏర్పాటు చేశారని ప్రస్తుతం ఆ బోర్డునే తొలగించి హరితహారం మొక్కలు నాటడం కోసం గుంతలు తీయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. హరితహారం మొక్కల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్న ఈ ప్రభుత్వము నాటిన మొక్కలన్నీ పెరుగుతున్నాయా, రక్షణ ఉన్నాయా ఒక్కసారి గమనించాలని అన్నారు. కలెక్టర్ కార్యాలయముకు కూతవేటు దూరంలో వెనక భాగంలో రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెంలోని సర్వే నెంబరు 250 లో వందలాది ఎకరాల భూమిలో మట్టి మాయమవుతుంటే, చెట్లు తొలగిస్తుంటే ఎందుకు యంత్రాంగం పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతుంటే వాటిని కాపాడి మొక్కలు పెంచాలని సూచించారు. జిల్లా యంత్రాంగం నిరసన తెలియజేసి ప్రతి ఒక్కరిపై ధమనకాండ ప్రయోగిస్తున్నారని మొన్నటి మొన్న త్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు నిరసన తెలియజేస్తే కేసులు పెట్టి జైల్లో పెట్టి బేడీలు వేసిన ఘటన జిల్లా ప్రజలు మర్చిపోకముందే మరో మారు నిరసన తెలియజేయడానికి వీలు లేకుండా ధర్నా చౌక్ ను ఎత్తివేయడాన్ని ప్రజాసంఘాలుగా తీవ్రస్థాయిలో ఖండిస్తున్నామని ఇప్పటికైనా ప్రతిపాదనను విరమించుకొని, మొక్కలు నాటకుండా ఉండాలని లేకపోతే అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని పోరాటాన్ని ఉధృతంగా కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లెల్ల పెంటయ్య, రాచకొండ రాములమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, ఎండి. పాషా, బోడ భాగ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సల్లూరి కుమారు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, మెతుకు అంజయ్య, మేడబోయిన శ్రీనివాస్, పిట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ కి పూల మొక్కతో స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పథి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తదితరుల దృశ్యం. - భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి)




## తెలంగాణ ప్రజల గొంతు తడిపిన మిషన్ భగీరథ

### జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్

చిగురుమామిడి (వాయిస్ టుడే): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ మంచి నీళ్ల పండుగ కార్యక్రమంను చిగురుమామిడి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో పాల్గొన్న స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మిషన్ భగీరథ కార్యక్రమములో ప్రతీ ఇంటికి నల్లాల ద్వారా సురక్షితమైన త్రాగు నీటిని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ గారిదని, ఉమ్మడి రాష్ట్రములో భూగర్భ జలాలలో కలుషితమైన నీరు, అధిక మోతాదులో ఫ్లోరైడ్ వలన ఫ్లోరోసిస్ వ్యాధి, కలరా, టైఫాయిడ్, మూత్రపిండాల వ్యాధుల బారిన పడే వారన్నారు. ప్రస్తుతం గోదావరి, కృష్ణ నదుల నుండి ఉపరితల జలాలతో అంతర్గత పైపులైన్ల ద్వారా ప్రతి పల్లెకు, ప్రతి ఇంటికి శుద్ధి చేయబడ్డ నీళ్లు అందిస్తున్నది తెలగాణ ప్రభుత్వమని, ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ మిషన్ భగీరథ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రశంసిస్తూ దేశములో సమగ్ర నీటి పథకాన్ని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రముగా కితాబిచ్చిందని అయన పేర్కొన్నారు. అంతేగాక దీనిని ఆదర్శంగా హర్ ఘర్ జల్ పథకం పేరుతో దేశం మొత్తానికి అమలు చేయాలనడం తెలంగాణకు గర్వకారణమన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, గ్రామ ప్రత్యేకాధికారి రాకేష్ రెడ్డి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎఈ వినయ్ సాయి, పంచాయితీ కార్యదర్శి గడ్డం వెంకటరమణ, సెర్ఫ్ మహిళలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మల్కపేట జలాశయం రెండో పంపు ట్రయల్ రన్ సక్సెస్

### ట్రయల్ రన్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

### రెండో పంపు ట్రయల్ రన్ సక్సెస్‌పై మంత్రి కే తారక రామారావు హర్షం

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (వాయిస్ టుడే): కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ - 9 లో భాగంగా నిర్మించిన మల్కపేట జలాశయంను 15 - 20 రోజుల్లో సిఎం కేసిఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పిన విషయం తెలిసిందే.అందుకు అనుగుణంగా నే ఇటీవలే మే 23 న మొదటి పంపు ట్రయల్ రన్ ను విజయవంతం కాగా ఆదివారం వేకువ జామున రెండో పంపు విజయవంతం చేశారు.దీంతో మల్కపేట జలాశయం రెండు పంపుల విజయవంతం అయి ప్రారంభానికి సిద్ధమైంది. రెండో పంపు ట్రయల్ రన్ కూడా సక్సెస్ అవ్వడం పట్ల మంత్రి కేటీఆర్, జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.



## జిల్లాలో అంబరాన్ని అంటిన తెలంగాణ రాష్ట్ర



## మంచి నీళ్ల పండుగ సంబరాలు

### రాష్ట్రంలో మంచినీటి ఘోస ను తీర్చిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ దే

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు సహా అన్ని మండల కేంద్రాలు, గ్రామ పంచాయితీ లలో స్థానిక ప్రజా ప్రతినిధులు,సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన నీళ్ల పండగ సంబరాలను పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని మహిళలకు పాఠశాల విద్యార్థినిలకు మిషన్ భగీరథ ట్యాంక్ దగ్గర ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం మిషన్ భగీరథ నీళ్లను ప్రతి ఒక్కరు త్రాగాలని పాఠశాల విద్యార్థులచే గ్రామాల వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ నల్ల ద్వారా అందిస్తున్నటువంటి త్రాగునీటి పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో, జిల్లాలో మంచినీటి ఘోస ను శాశ్వతంగా తీర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని ప్రజా ప్రతినిధులు కొనియాడారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ ల సర్పంచ్ లు, పాలకవర్గం సభ్యులు, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రాఇంజనీర్ లు, స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు . విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# న్యాయవిద్యలో ఎంత విజ్ఞానాన్ని సంపాదించినా.. ఎప్పటికీ అందరమూ విద్యార్థులమే

## న్యాయవ్యవస్థలో న్యాయవాదుల పాత్ర ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్

భువనగిరి,జూన్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి) :- భారత రాజ్యాంగం ప్రధాన ఉద్దేశం సమానత్వాన్ని, ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందని, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు.

ఆదివారం నాడు భువనగిరి పట్టణం న్యూదీప్తి హోటల్లో జరిగిన అఖిల భారత న్యాయవాదుల యూనియన్ మూడవ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులను, న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...

భారత రాజ్యాంగం ఒక గొప్ప గ్రంధమని,ఈ గ్రంధాన్ని అందించిన మహానుభావులకు మనము కృతజ్ఞతలుగా ఉండాలని, రాజ్యాంగం యొక్క ముఖ్య ఉద్దేశ్యం సమానత్వమని,ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించడం జరిగిందని అన్నారు. చట్టం మనకు హక్కులను, స్వేచ్ఛాయిత జీవితాన్ని కల్పిస్తుందని,కాని చట్టాన్ని ఉల్లంఘించుట నాగరిక సమాజ దురదృష్టమని అన్నారు. గౌరవ సుప్రీం కోర్టుకు ప్రతిష్ట తెచ్చిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారని,వారు తమ తీర్పులతో న్యాయవ్యవస్థకు గౌరవం తెచ్చారని ఆయన అన్నారు. రాజ్యాంగంలో ఎన్నో మార్పులు చేర్పులు చేయవచ్చు కానీ ప్రాథమిక హక్కులను మార్పు చేయలేమని, రాజ్యాంగంలో మార్పులెన్ని తెచ్చినా న్యాయ వ్యవస్థ రాజ్యాంగ మౌళిక సూత్రాలకు లోబడే పనిచేస్తుందని, సహజ న్యాయం అందించడంలో స్వాగతించాలని అన్నారు. సమానత్వం, స్వేచ్ఛలపై వచ్చిన అనేక కేసులు, మార్పులు, చేర్పులపై విశదీకరించారు. రాజ్యాంగం లోని 21 ఆర్టికల్ కు సవాలుగా ఎన్ని కేసులు వచ్చినా స్వేచ్ఛ, సమానత్వపు మౌళిక సూత్రాలకు ఎన్నటికీ విఘాతం కలగలేదని, న్యాయవిద్యలో ఎంతో విజ్ఞానాన్ని సంపాదించినా ఎప్పటికీ అందరమూ విద్యార్థులమేనని, న్యాయవ్యవస్థలో న్యాయవాదుల పాత్ర ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని,పరిపూర్ణమైన సహజ తీర్పులు రావాలన్నా, సత్వర న్యాయం ప్రజలకు చేరువ కావాలన్నా న్యాయవాదుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. రాజ్యాంగం యొక్క మౌళిక సూత్రాలకు ఎవరూ ఆటంకం కలిగించకూడదని, అధికార పరిధి రాజ్యాంగానికి లోబడి, మౌళిక సూత్రాలకు కట్టుబడి ఉండాలని చెప్పిన విస్తృత ధర్మాసనం వెలువరించిన తీర్పును కేశవానంద భారతి కేసులో అంశాలను ప్రత్యేకంగా గుర్తించడం జరిగిందని ఆయన అన్నారు. పౌరుల హక్కులను కాల రాసినప్పుడు న్యాయ వ్యవస్థలు వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. పౌరుల యొక్క హక్కులను రక్షించే విషయంలో న్యాయవాదులు ప్రముఖమైన పాత్ర వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె. మారుతి దేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళి మోహన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్ రావు,

అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి సుమలత, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏనుగు నరసింహారెడ్డి, ఐలు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.విద్యాసాగర్,ఐలు రాష్ట్ర కమిటీ జనరల్ సెక్రెటరీ పి.వి.సురేంద్ర నాథ్, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగారం అంజయ్య,రిసెప్షన్ కమిటీ సెక్రెటరీ ఎండి. ఇస్మాయిల్,న్యాయవాదులు పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. వెంకట్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు వీర బ్రహ్మం, రాజు,ఉమ్మడి నల్లగొండ జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ న్యాయ సహాయ న్యాయవాదులు, కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.







గజ్వేల్ నియోజకవర్గం లో సమీకృత మార్కెట్, పాండవుల చెరువు, స్మశాన వాటికను ఆలేరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతోటి సందర్శించిన ఆలేరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తదితరుల దృశ్యం. - భువనగిరి(వాయిస్ టుడే ప్రతినిధి)



**కంచి కామకోటి మఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి సేవలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు**

నిర్మల్ జిల్లా(వాయిస్ టుడే) జూన్ 18: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆహ్వానం మేరకు స్వామి వారు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దంపతులు స్వామివారి ఆశీస్సులను పొందారు.



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆలేరు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులతో సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండల్ మంగోల్ గ్రామంలో మల్లన్న సాగర్ త్రాగునీటి శుద్ధికరణ కేంద్రమును సందర్శించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తదితరుల దృశ్యం.

- భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి)

## మున్నూరు కాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న BRS నాయకులు డాక్టర్ గోలీ మోహన్



రాజన్న సిరిసిల్ల/ వేములవాడ, జూన్ 18 (వాయిస్ టుడే): మున్నూరు కాపు కులస్తులు డాక్టర్ గోలి మోహన్ ను ఆత్మీయ స్వాగతంతో గ్రామంలోకి ఆహ్వానించారు. మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ మీలాంటివారు మా కాపు కులం నుంచి ఎదగడం ఎంతో సంతోషంగా ఉందని రాబోయే రోజుల్లో మీరు వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు కాబట్టి మా మద్దతు మీకు ఇస్తామని కచ్చితంగా వేములవాడ నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమై మేము మీ గెలుపు కోసం పనిచేస్తామని అన్నారు. గ్రామ సర్పంచ్ స్వామి మాట్లాడుతూ డాక్టర్ గోలి మోహన్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మంది పేదలకు చేయూతనిస్తున్నాడని యువకులకు ఉద్యోగం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని ఇలాంటి నాయకుడిని మన వేములవాడ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో శాసనసభ్యునిగా మనమందరము కలిసికట్టుగా ఉండి గెలిపించుకోవాలని అన్నారు.డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ కాపు అంటే కాపాడుకునేవాడని పేద ప్రజలకు దేశానికి అన్నం పెట్టేవాడని కానీ మనము రాజ్యాధికారానికి దూరం అవుతున్నాము కాబట్టి మనము ఆర్థికంగా ఎదగాలి మన పిల్లలు చదువు, ఉద్యోగం ఉపాధిలో ఉండాలి మనం కూడా రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని దానికోసం ఈరోజు వేములవాడ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో శాసన సభ్యునిగా పోటీ చేస్తున్నానని, నియోజకవర్గంలోని ప్రజలందరూ నన్ను ఒక బిడ్డ లాగా, ఒక అన్నలాగా, ఒక తమ్ముడిల్లాగా ఆశీర్వదించాలని కోరారు. మనమందరము ఐక్యతతో ఉండి అన్ని వర్గాల ప్రజలను ఒకటి చేసి గెలుపు కోసం మీరందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. మున్నూరు కాపు కార్యవర్గ సభ్యులు, రైతు సమన్వయ అధ్యక్షులు ఆకుల నరసయ్య సర్పంచ్ స్వామి, యువకులు పాల్గొన్నారు.



## మంకీ భారత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బిజెపి నాయకులు

నిర్మల్ జిల్లా (వాయిస్ టుడే) జూన్ 18: ఈరోజు సోన్ మండల కేంద్రంలో మరియు కడ్తాల్ గ్రామంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి 102 వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బిజెపి నాయకులు కార్యకర్తలు వీక్షించడం జరిగింది మోదీ గారు మాట్లాడిన అంశాలను వినడం జరిగింది మన్ కీ బాత్ ద్వారా దేశ ప్రజలకు సలహాలు సూచనలు ఇవ్వడమే కాకుండా ఆదర్శప్రాయంగా దేశంలో జీవిస్తున్న వారి మార్గదర్శకతను దేశ ప్రజలకు మోడీ గారు దేశ ప్రజలకు వివరిస్తూ ఉన్నారు అలాగే మన్ కీ బాత్ కు ముందు మోడీ గారు సలహాలు సూచనలు కూడా దేశ ప్రజల నుండి స్వీకరించడం జరుగుతుంది. కావున ప్రతి నెల చివరి ఆదివారం తప్పకుండా ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని నాయకులు తెలిపారు ఈసారి మోడీ గారు ఈనెల చివరి ఆదివారం విదేశీ పర్యటనలు ఉండడం ద్వారా ఈసారి మూడవ ఆదివారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ద పెల్లి జిల్లా ఇన్చార్జ్ రావుల రామనాథ్ లీగల్ సెల్ ఇంచార్జ్ అంజు కుమార్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షులు మ్యాక ప్రేమ్ కుమార్ ప్రధాన కార్యదర్శి మేకల అశోక్ నాయకులు మార గంగారెడ్డి ముత్కపల్లి నరేష్ మామిడాల సంతోష్ కందూరి దినేష్ బాలకృష్ణ సవీన్ గడ్డం నరసయ్య లింగన్న శ్రీనివాస్ వర్మ హైమద్ నారాయణ బర్మ గంగన్న పోశెట్టి శ్రీనివాస్ సృజన్ తదితర నాయకులు కార్యకర్తలు ఉన్నారు



## ఐటీ అధికారుల నుండి ఎమ్మెల్యే పైళ్లకు క్లీన్ చీట్ రావడంతో నియోజకవర్గంలో భారీ ర్యాలీ

భువనగిరి, జూన్ 18 (వాయిస్ టుడే ప్రతినిధి) :- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పై జరిగిన ఐటీ సోదాల్లో ఐటీ అధికారులు క్లీన్ చీట్ ఇవ్వడంతో నియోజకవర్గం లో ఆదివారంరోజు ఎమ్మెల్యే కి మద్దతుగా బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,ఎమ్మెల్యే అభిమానులు భారీ ఎత్తున బిబినగర్ ఎయిమ్స్ హాస్పిటల్ వద్దనుండి ర్యాలీ నిర్వహించారు . బీ బీ నగర్ , పోచంపల్లి మండల పట్టణ నాయకులు కార్యకర్తలు ఎయిమ్స్ హాస్పిటల్ వద్దకు పెద్ద సంఖ్య లో చేరుకొని ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి అక్కడనుండి హైవే మీదుగా ఎమ్మెల్యే తో కలిసి బైక్ ర్యాలీ తో భువనగిరి పట్టణానికి చేరుకొని,పట్టణం లోని మాస్ కుంట ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం భువనగిరి,వలిగొండ మండల పట్టణ నాయకులు కార్యకర్తలు భువనగిరి పట్టణం లోని మదర్ డెయిరీ చిల్లింగ్ స్టేషన్ వద్ద భారీగా చేరుకొని ఎమ్మెల్యే కి పూలమాల లతో మంగళ హారతులతో జనం నీరాజనం పట్టారు. పట్టణంలో మదర్ డయిరీ నుండి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకొని క్యాంప్ కార్యాలయం లో మీడియా సమావేశం లో పాల్గొని మీడియా తో మాట్లాడుతూ.. బుధవారం నుండి మూడురోజులుగా నా నివాసం పై ఐటీ దాడులు నిర్వహించి దస్త్రా వేజులు పరిశీలించారని, అందుకు ఐటి అధికారులకు అన్ని రకాలుగా సహకరిచానని అన్నారు.

బంధువుల ఇళ్లలో,కీలక దస్త్రావేజులు స్వాధీనం అంటూ టీవీ ఛానెళ్లలో స్క్రోలింగులు వేయడం కరెక్ట్ కాదని మీడియా మిత్రులకు తెలియజేశారు. సౌతాఫ్రికాలో మైనింగ్ లు ఉన్నాయంటూ దుష్ప్రచారాలు తగదన్నారు. తనకు ఉన్నది ఒకటే వ్యాపారం రియల్ ఎస్టేట్ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తనపై కావాలనే దాడులు నిర్వహించి నాకున్న ప్రజారాధనపై దెబ్బ తీయాలనే కుట్ర చేశారని అన్నారు. నిస్వార్ధపరుడని నన్ను నమ్మి ప్రజలు రెండు పర్యాయాలు నన్ను గెలిపించారని,నామీద అనవసరంగా బురద జల్లితే నా నియోజకవర్గ ప్రజలు సహించారని దానికి నిదర్శనమే ఈరోజు ఈ భారీ ర్యాలీ అని అన్నారు. నాపై నమ్మకంతో ఎంతపెద్ద ఎత్తున కదలి వచ్చి నాకు మద్దతు తెలిపిన నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు,అభిమానులకు కృతజ్ఞతలు అని తెలిపారు.



## ప్రగతి నివేదన యాత్ర ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి, జూన్ 18,(వాయిస్ టుడే) ప్రగతి నివేదన యాత్ర పేరుతో స్టేషన్గన్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గత 16 రోజులుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో తిరుగుతూ ప్రజలతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా మండలంలోని ఖిలాషా పురం గ్రామంలో శనివారం రాత్రి రైతు వేదిక వద్ద పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే రాజయ్య ఆదివారం ఉదయం ఖిలాషాపురం గ్రామంలో గల విధులన్నీ తిరుగుతు ఇంటింటికి వెళ్లి ప్రజల్ని పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ నీళ్లు అందించే ఇంటింటికి అందించే విషయంలో కొన్ని చోట్ల నల్లాలు అసలే లేకపోవడంతో గోదావరి నీళు ళ్ళ వృధాగా పోతుందటంతో వెంటనే ఆర్డబ్ల్యూఎస్ అధికారికి ఫోన్ చేసి గ్రామంలో వెంటనే మిషన్ భగీరథ మంచినీళ్లు ప్రతి ఇంటికి అందించే విధంగా చర్యలు చేపట్టాలని అయన ఆదేశించారు. సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారిని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వారాల రమేష్ యాదవ్, స్టేషన్గన్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎర్రోళ్ల కుమార్ గౌడ్, జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, నియోజకవర్గ మహిళా ఇన్చార్జి మడ్లపల్లి సునీత, శివరాత్రి రాజు, మండల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ తిప్పారపు రమ్య , కావటి రాజయ్య, జిట్టే వీరస్వామి, కుర్ర కమలాకర్ గౌడ్, కోర్ర రాజేందర్ నాయక్,కోడిదేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
సోమవారం 19 జూన్ 2023



## ట్రాన్స్ఫార్మర్ అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్ డి.ఎస్.పి జీవన్ రెడ్డి

నిర్మల్ జిల్లా (వాయిస్ టుడే): సోన్, ట్రాన్స్ఫార్మర్లను పగలగొట్టి దొంగతనం చేసిన అంతర్ రాష్ట్ర ముఠాను ఆదివారం అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి జీవన్ రెడ్డి అన్నారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి ట్రాన్స్ఫార్మర్ దొంగతనాలు చేశారని డి.ఎస్.పి జీవన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్ లో డి.ఎస్.పి జీవన్ రెడ్డి మాట్లాడుతూ మామడ గ్రామానికి చెందిన ర్యాపని ఎల్లయ్య, నిజాంబాద్ కు చెందిన బాబురావు దండేల్వార్, నాందేడ్ కు చెందిన పఖరు గోరె అనే ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి వ్యవసాయ తోటల్లో గల ట్రాన్స్ఫార్మర్లను పగులగొట్టి వాటిలో గల రాగి తీగలను దొంగతనం చేద్దామని ముందుగా ప్లాన్ వేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. రేపన్ ఎల్లయ్య అనే వ్యక్తి నుండి పెరోల్ మీద బయటకు వచ్చి మిగతా ఇద్దరితో కలిసి ఇలా దొంగతనం చేయాలి ట్రాన్స్ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగలను అమ్ముకోవాలని ప్లాన్ ప్రకారం దొంగతనాలు చేయడం జరిగిందని అన్నారు. ముగ్గురు కలిసి రేపని ఎల్లయ్య కారులో వెళ్లి సోన్ గ్రామ శివారులో తోట పొలాల్లో గల ట్రాన్స్ఫార్మర్ను పగలగొట్టి అందులోని రాగి తీగను దొంగిలించుకుని వెళుతుండగా లక్ష్మణ్ చందా మండలం కనకాపూర్ గ్రామ శివారులోని మరొక ట్రాన్స్ఫార్మర్ను పగలగొట్టి దానిలో గల రాగి తీగను దొంగిలించారని, అలాగే మామడ మండలం లింగాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గల మరొక ట్రాన్స్ఫార్మర్ను పగలగొట్టి రాగి తీగలను దొంగిలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. సోన్ పోలీసులు, మామడ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. నిందితుల నుండి రేపన్ ఎల్లయ్య యొక్క కారు, స్క్రూ డ్రైవర్, రింగ్ పాన, సెల్ ఫోన్, రాగి వైరు స్వాధీనం చేసుకున్నట్లు జీవన్ రెడ్డి తెలిపారు.



## బీఎస్పీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

మునగాల జూన్18(వాయిస్ టుడే): మునగాల మండలంలోని రేపాల గ్రామంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్న మూడు కుటుంబాలకు బీఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి పిల్లుట్ల శ్రీనివాస్ నిత్యావసర సరుకులను అందజేసినట్లు బీఎస్పీ పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల శ్రీను తెలిపారు.ఆదివారం గ్రామంలో ఇటీవల మరణించిన మాచర్ల రంగయ్య, సోమపొంగు సాయిరాంకు ఇటీవల గాయపడగా,పెన్షన్ రాక ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్న సోమపొంగు కనకమ్మ కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు.బీఎస్పీ రాష్ట్రంలో పేదల కోసం నిరంతరం పని చేసే పార్టీ అని,ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యమంత్రిని, పిల్లుట్ల శ్రీనివాస్ ను ఎమ్మెల్యేగా చేసేందుకు బహుజన ప్రజలు ఆలోచించాలని,అప్పుడే పేదరికం లేకుండా పోతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల ఉపాధ్యక్షులు సోమపొంగు కార్తీక్, మండల జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సెక్రటరీలు చిట్టిబాబు, సోమపంగు బాలు, రేపాల గ్రామ శాఖ అధ్యక్షుడు చిర్ర గురవయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఈనెల 19వ తేదీన బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి

### జిల్లా కన్వీనర్ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి



కోదాడ ::జూన్ 18(వాయిస్ టుడే) నెల 19వ తేదీన హైదరాబాద్ కాచిగూడ లోని అభినందన హోటల్లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. ఆదివారం నాడు ఆయన మున గాలలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... బీసీ కులాల్లోని కొంతమందికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల రుణ సౌకర్యం కల్పిస్తున్నారని ఇది మిగతా బీసీ కులాలను అవమానించినట్టుగానే భావిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బీసీ కులాల్లో ఉన్న నిరుపేదలను గుర్తించి వారందరికీ లక్ష రూపాయల రుణ సౌకర్యం కల్పించాలని, ఆయన డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎందరు పాలకులు మారినా బీసీ ల ను చిన్నచూపు చూస్తున్నారే తప్ప వారి కొరకు చేసింది శూన్యమని, కేంద్రంలో బీసీకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలని కోరుతున్నామని, అలాగే చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని త్వరలోచేపట్టే జనగణనలో బీసీ జన గణన చేపట్టాలని కేంద్రంలో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని, తెలంగాణలో కూడా బీసీ సబ్ ప్లాన్ కొరకు 20 వేల కోట్ల రూపాయలు కేటాయించి బీసీలను అభివృద్ధి పరచాలేగాని ఎన్నికలు వచ్చాయి కాబట్టి బీసీల మీద అమాంతం ప్రేమ పెరిగిపోయినట్టుగా కేసీఆర్ నటిస్తున్నారని కెసిఆర్ గత తొమ్మిది సంవత్సరాలుగా ఏ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా నెరవేర్చలేకపోయారని మిషన్ కాకతీయ,,మిషన్ భగీరథ,, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింల గిరిజనుల రిజర్వేషన్లు పోడు భూముల పట్టాలు లాంటి అనేక పథకాలు కొసకు వెళ్లలేదని ఇప్పుడు బీసీల జపం చేస్తున్నారని ఇదంతా కపటనాటకం అని ఆయన ఎద్దేవా చేశారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కోల ఉపేందర్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చింతకాయల నాగరాజు మండల ప్రధాన కార్యదర్శి కోల ఆంజనేయులు బెజవాడ గోవర్ధన్ నాగు శంకర్, గంధం సైదులు తదితరులు ఉన్నారు.

# గడప గడపకు మంచినీటి పథకం దేశానికి ఆదర్శం

## మెదక్ జిల్లా ప్రాజప్రతినిదులు, ప్రభుత్వ అధికారులు

మెదక్, జూన్ 18, (వాయిస్ టుడే): రాష్ట్ర ముఖ్యమంత్రి భవిష్యత్తు తరాలకు కూడా ఉపయోగపడే విధంగా చాలా దూరపు ఆలోచనతో దేశం తెలంగాణా వైపు చూసే విధంగా పక్క ప్రణాళికతో శాశ్వత కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజల మన్ననలు చూరగొంటున్నారని నర్సాపూర్ శాసనసభ్యులు మదన్ రెడ్డి అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో జానారెడ్డి మెదక్ జిల్లా హత్నూర మండల బోర్పట్ల లోని త్రాగునీటి శుద్దీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు వాటర్ బెడ్ లో జల శుద్దీకరణ జరుగుచున్న తీరును మెదక్ శాసనసభ్యులు పద్మా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం జిల్లా అద్యక్షులు కల్లూరి హరిక్రిష్ణ తదితర ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు కల్లూరి హరిక్రిష్ణ ను ఘనంగా శాలువాలతో సన్మానించి మెమెంటో తో సత్కరించారు.ఏమల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో నీళ్ల కోసం మహిళలు ఎంతో గోస పడ్డారని, నీళ్ల కోసం మహిళలు కిలోమీటర్ల దూరం బోర్లు, బావుల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకునేవాళ్ళని అన్నారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే గా ఉన్న సమయంలోనే సిద్దిపేట లో మంచినీటి పథకాన్ని ప్రారంభించారని, తెలంగాణా ఏర్పడ్డ తరువాత మంచినీళ్లకు మహిళలు ఇబ్బంది పడరాదనే సాహసోపేతమైన నిర్ణయం ఛాలెంజ్ గా తీసుకొని నేడు గడపగడపకు మంచినీటిని అందిస్తున్నారని అన్నారు.ఇలా ముఖ్యమంత్రి సాహసోపేతంగా ఎన్నో సంస్కరణలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని రంగాలలో పురోగమిస్తూ దేశం తెలంగాణా వైపు చూసేలా చేస్తున్నారని అన్నారు.



మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గడపగడపకు శుద్ధిచేసిన జలాలు అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి కాపాడన్నారు. గతంలో 5-6 రోజులకు ఒకసారి మంచినీళ్లు వచ్చేయని, ఎండాకాలం వచ్చిందంటే మహిళలు కిలో మీటర్ల దూరం బావుల దగ్గరికి వెళ్లి నీళ్లు తెచ్చేవారని,జాలు కాయలు కాసేవని, బోర్లు కొట్టి చేతులు పడిపోయేవాని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన సరిపోయేవి కావని, గ్రామాలకు వెళ్లాలంటే మహిళలు బిందెలతో నిరసన తెలిపేవారని అన్నారు. అటవీ, జాతీయ రహదారులు, రైల్వే అనుమతులు వంటి ఎన్నో అవాంతరాలు ఎదురైనా వెరవక రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్నర కిల్ మీటర్ల మేర పైపులైన్ వేసి ఇంటింటికి మిషన్ భగీరథ నీటిని ఆనందించిన అపరాభగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో ఏ సమస్యకైనా వెన్నుదరవక శాశ్వత పరిష్కారం చూపేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవించడానికి, శరీరానికి 2/3 వంతు నీరు అవసరమని, గంగను దివి నుండి భువికి తెచ్చిన అపర భగీరథుడు కేసీఆర్ అన్నారు. గాథలో నీళ్ల కోసం పడ్డ కష్టాలు తలుచుకుంటే వణుకు పుట్టిస్తుందని, భూగర్భజలాలు అడుగంటి త్రాగునీటి, సాగునీటికి ఇనో కష్టాలు అనుభవించామన్నారు. మనం పదవిలో ఉన్న లేకున్నా ప్రజల అవసరాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చూపించేవాడే నిజమైన నాయకుడని పలుమార్లు ముఖ్యమంత్రి అనేవారని గుర్తుచేశారు. 47 వేల కోట్లతో లక్షన్నర కిలో మీటర్ల పైప్ లైన్ వేసి ప్రజాదాహర్తిని తీర్చిన మహానుబాగావుడు కేసీఆర్ అని అన్నారు.

జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు కల్లూరి హరిక్రిష్ణ లు మాట్లాడుతూ ఇంజనీర్ల అద్భుత సృష్టి మిషన్ భగీరథ అని అన్నారు. ప్రపంచ స్థాయిలో తలదన్నే విధంగా ఇంజనీర్లు రేయింబవళ్లు ఎంతో కష్టపడి ప్రతి మారుమూల గ్రామా, తాండాలను కూడా ఇంటింటికి స్వచ్ఛమైన జలాలు అందిస్తున్నార్నయి అన్నారు. మిషన్ భగీరథ విజయవంతంతో పలు రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నారాయని, కేంద్రం కూడా హర్ గర్ జల్ పథకాన్ని అమలుచేస్తున్నదని అన్నారు. జిల్లాలో 5 వేల కిలో మీటర్ల మేర పైప్ లైన్ తో పాటు కొత్తగా 668 ఓ.హెచ్.ఎస్.ఆర్. ట్యాంకులు నిర్మించామని నేడు మంచినీళ్ల పండుగను జిల్లాలోని అన్ని ఓ.హెచ్.ఎస్.ఆర్. ట్యాంకుల వద్ద పండుగ వాతావరణంలో నిర్వహించామన్నారు.

మిషన్ భగీరథ అడ్వైజర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ మిషన్ మోడ్ లో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్న కిలో మీటర్ల మేర పైప్ లైన్ తో పాటు కొత్తగా 18 వేల ఓ.హెచ్.ఎస్.ఆర్. ట్యాంకులు నిర్మించుకున్నామని, 57 లక్షల నల్లాలు ఏర్పాటు చేశామన్నారు.



## రఘునాథపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి, జూన్ 18,(వాయిస్ టుడే): ప్రగతి నివేదన యాత్రలో భాగంగా మండలంలోని ఖిలాషాపురం గ్రామంలోని రైతువేదిక వద్ద పల్లెనిద్ర చేసిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాడికొండ రాజయ్యను ఆదివారం ఉదయం రఘునాథపల్లి మండల ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య టిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పాత్రికేయులతో ఇష్ట గోష్టిగా మాట్లాడారు.అనంతరం రఘునాథపల్లి మండల ప్రెస్ క్లబ్ మూడవ సారి నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మేకల రవీందర్ (ఆంధ్రజ్యోతి) ప్రధాన కార్యదర్శి బంధ రవీందర్ ( నమస్తే తెలంగాణ) కోశాధికారి సుంకరి శ్రీనివాస్( ప్రజాపక్షం )లను ఎమ్మెల్యే రాజయ్య శాలువాతో పార్టీ నాయకుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన టియుడబ్ల్యూజే (ఐ జే యు) నియామకంలో నూతనంగా టియుడబ్ల్యూజే ( ఐ జే యు) జనగామ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహ్మద్ దస్తగిరి ( అక్షరం ) ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య అయనను శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వారాల రమేష్ యాదవ్, జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎర్రోళ్ల కుమార్ గౌడ్, నియోజకవర్గ మహిళ ఇన్చార్జ్ మడ్లపల్లి సునీత, మండల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ తిప్పారాపు రమ్య,మార్కెట్ డైరెక్టర్ శివరాత్రి రాజు,కోడిదేటి శంకర్,కుర్ర కమలాకర్ గౌడ్,జిట్టే వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా ప్రకారం ఇంటింటా సర్వేను పకడ్బందీగా చేయాలి

### -జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్



కరీంనగర్, జూన్ 18 (వాయిస్ టుడే): ఓటర్ జాబితా ప్రకారం ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని పోచమ్మ వాడ 39వ వార్డు మరియు ఎలగందల్ గ్రామంలో ఓటరు జాబితా ఇంటిటి సర్వేను జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాబితాలోని వివరాల ప్రకారం ఇంటినెంబరు, కుటుంబ సభ్యుల వివరాలను అడిగితెలుసుకున్నారు. జాబితాలో ఓటరుగా నమోదైన ఓటరు మరోచోటకు బదిలైన, మరణించిన వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బిఎల్ఓ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీఓ ఆనంద్ కుమార్, తాసిల్దార్ వెంకట్ రెడ్డి , బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



వరంగల్ నిన్న కేటీఆర్ పర్యటనలో ఈటీవీ కెమెరామెన్ వెంకట్పై జరిగిన దాడిపై ఈరోజు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్ కు కంప్లైంట్ ఇవ్వడం జరిగింది... దీనికి రెండు యూనియన్ల నేతలు మాకు మద్దతు తెలిపి సిపి కి జరిగిన సంఘటనపై వివరించారు కచ్చితంగా కెమెరా మెన్ వెంకట్ పై దాడి చేసిన ఆర్ఐ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- వరంగల్ (వాయిస్ టుడే)

## కోదాడ విద్యార్థుల ర్యాంకుల పంట

కోదాడ ::జూన్ 18(వాయిస్ టుడే ) జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో సూర్యాపేట జిల్లా కోదాడ కవితా శ్రీవిద్య కళాశాలల విద్యార్థులు టి శివనందిని (H.No : 236155226)1376 ఆల్ ఇండియా ర్యాంక్ మరియు టీ భాను తేజస్వి (H.No : 236183178) 1874 ఆల్ ఇండియా ర్యాంక్ మరియు జీ వంశీ(%ఎ.చీశీ% : 236183101)2266 ఆల్ ఇండియా ర్యాంక్ మరియు ఏ యశ్వంత చారి (H.No : 236183017) 6316 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించినారు. ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శ్రీవిద్య కళాశాల ప్రిన్సిపల్ కెమిస్ట్రీ వెంకటేశ్వరరావు మరియు కవిత కళాశాల ప్రిన్సిపల్ గద్దె రఘు,కరస్పాండెంట్ మదల శ్రీధర్ మరియు అధ్యాపకులు అభినందించారు.

